## ఆదిత్యలో జాతీయ ఓటర్లు దినోత్సవం సందర్భంగా పోటీలు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక సాంబమూర్తినగర్ నగర్లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ యమ్.ఎస్.ఎన్. క్యాంపస్ అచ్చంపేట నందు వివిధ పోటీలలో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ కె. కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా. బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 26వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ఎలక్షన్ కమీషన్ ఏర్పాటు చేయబడిన రోజునే జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటామని ఆయన అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. కరుణ మాట్లాడుతూ యమ్.ఎన్.ఎస్. క్యాంపస్ నిర్వహించిన వివిధ పోటీలలో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని, అందులో తమ విద్యార్థినులు ప్రతిభను చూపారు అన్నారు. ఉపన్యాసంలో మొదటి, రెండవ మరియు మూడవ బహుమతి, స్లోగన్ రైటింగ్‌లో మొదటి మూడు బహుమతులు, చర్చలో మొదటి మూడు బహుమతులు మరియు క్విజ్లో రెండవ, మూడవ బహుమతి సాధించిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. నాగ శ్రీకాంత్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొని బహుమతి సాధించిన విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమలో ముఖ్య అతిధిగా ఎ.కె. యన్.యు, యమ్.ఎస్.ఎన్. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ పాల్గొన్నారు. అలాగే ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.సురేఖ దేవి, కె.వి.కె.ఆర్. వంశీ, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.


# సూర్య

17వ

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం,26 జనవరి 2024




# రాష్ట్రంలో అరాచక పాలన

**- బీజేపీకి తొత్తులుగా మారిన వైసీపీ, టీడీపీ ఎంపీలు**

**- కాంగ్రెస్ ద్వారానే రాష్ట్రానికి న్యాయం - పీసీసీ చీఫ్ షర్మిల**





**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని అధికార వైసీపీ ప్రభుత్వంలో రాక్షస పాలన సాగుతోందని దాన్ని ప్రజలు తిరస్కరించాలని, రాష్ట్రంలో ఉన్న వైసీపీతోపాటు టీడీపీకి చెందిన ఎంపీలు బీజేపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. అంతేగాకుండా రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ ఎంపీలు ఢిల్లీ వెళ్లిన తర్వాత బీజేపీ ఎంపీలుగా వ్యవహరిస్తున్నారంటూ షర్మిల మండిపడ్డారు. గురువారం కాకినాడలోని సూర్య కళామందిరంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో పలువురు ప్రసంగించగా ముఖ్య అతిథిగా హాజరైన షర్మిల అధికార వైసీపీ పాలన వైఫల్యాలపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన జరుగుతుందని ఆశపడ్డ ప్రజలకు సీఎం జగన్ నేతృత్వంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. తమ తండ్రి, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశించిన విధంగా వైకాపా పార్టీలో సంక్షేమం అందుతుందని తాననుకున్నానని, దానికి విరుద్ధంగా అక్కడ రాక్షస పాలనను జగన్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని వచ్చిన వెంటనే రాష్ట్రానికి అవసరమైన ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన హామీలు వంటి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రత్యేక హెూదా పదేళ్లు ఇస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో ప్రకటించిందని, చివరి 5 ఏళ్లలో జగన్ ఆ హామీని పూర్తిస్థాయిలో నిర్వహించకపోగా ఆ పార్టీకి చెందిన ఎంపీలు ఢిల్లీలో కేంద్రంలోని బీజేపీ వారికి తొత్తులుగా వ్యవహరించారన్నారు. రాష్ట్రంలోని అధికార వైసీపీ, ప్రతిపక్ష జనసేన, టీడీపీలకు ఓట్లు వేయవద్దని వారిలో ఎవరికి వేసిన బీజేపీ ఖాతాలోకే వెళతాయని చెప్పారు. కాంగ్రెస్ ద్వారానే రాష్ట్ర ప్రజలకు సంక్షేమ, సుస్థిర పాలన అందుతుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆమె చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దిగజారుటకు నాడు చంద్రబాబు, నేడు జగన్ తీరే కారణమన్నారు. దివంగత సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం చీలిపోవడానికి ప్రధాన కారణం జగనే అని దీనికి సాక్ష్యం తమ అమ్మ విజయలక్ష్మి అని అన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతు పక్షపాతి అని ఆయన వ్యవసాయాన్ని పండగనేవారని ప్రస్తుతం ఆ పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. వైసీపీ కష్టాల్లో ఉన్నప్పుడు పిల్లలు, కుటుంబాన్ని వదులుకొని పాదయాత్ర చేశానని షర్మిల చెప్పారు. సీఎం అవ్వకముందు జగన్ ఒకలా ఉన్నారని అయిన తర్వాత మరోగా మరోలా మారారంటూ చెప్పారు. సీఎం జగన్ అయోమయ, అసమర్థ పాలన వల్ల రాష్ట్రానికి రాజధాని కూడా లేని పరిస్థితి తీసుకొచ్చారన్నారు. వైసీపీ పాలనలో ఎమ్మెల్యేలు కేవలం కీలుబొమ్మలుగా మారారని షర్మిల అన్నారు. ఈ ఏడాది జరిగే ఎన్నికలలో వైసీపీ, టీడీపీ, బీజేపీ, జనసేనలకు ఓట్లు వేయకండని, సంక్షేమపాలన అందించి విభజన హామీలు అమలు చేసి రాష్ట్రానికి న్యాయం చేసే కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేయాలని షర్మిల కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంఎం పల్లంరాజు, జెడి శీలం, సుంకర పద్మశ్రీ,గిడుగురుద్రరాజు,జంగాగౌతమ్, పి.రఘు వీరారెడ్డి, ఎస్.ఎన్. రాజా, కామన ప్రభాకరరావు, చిలుకోటి పాండురంగారావు, ఆకుల లలిత, ఆకుల వెంకటరమణ, బాలేపల్లి మురళి, తుమ్మల దొరబాబు, దాట్ల గాంధీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## చేతకాని హామీలతో మహిళా లోకానికి టోకరా వేసిన జగన్ రెడ్డి

**- కొండబాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మద్యపాన నిషేధం అని చెప్పి మాట తప్పిన జగన్, ఈరోజు కల్తీ సారా, కల్తీ మద్యానికి బలై వేలాది కుటుంబాలు నాశనం అవ్వటానికి కారణం జగన్ రెడ్డి అని, మహిళలను మోసం చేసిన జగన్ ను రాబోయే ఎన్నికల్లో గద్దె దించి ఇంటికి పంపటానికి మహిళా లోకం యావత్తు సిద్ధంగా ఉన్నారని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు విమర్శించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా గద్దె నెక్కడం కోసం మోసపూరిత మాయమాటలతో మహిళలకు వాగ్దానాలు ఇచ్చి నేడు మహిళాలోకాన్ని అన్ని విధాలా మోసం చేసిన వ్యక్తి సీఎం జగన్ అని, చంద్రబాబు నాయుడు హయాంలో డ్వాక్రా సంఘాల మహిళలకు అన్ని విధాలా అండగా నిలిచి మహిళా సాధికారతకు చంద్రన్న అండగా నిలిస్తే, ఆ డ్వాక్రా వ్యవస్థలను నేడు జగన్ రెడ్డి నిర్వీర్యం చేసాడని, రాష్ట్రంలో కోటీ 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే 79 లక్షల మందికే ఆసరా ఇస్తూ, సకాలంలో డ్వాక్రా రుణాలు చెల్లించిన 75% మందికి టోకరా వేసారని, చంద్రన్న హయాంలో పొదుపు మహిళలకు సున్నా వడ్డీ రూ.5 లక్షల వరకు వర్తింపజేశామని, తాను అధికారంలోకి వస్తే రూ.10 లక్షలకు పెంచుతానని నమ్మించి తీరా అధికారంలోకి రాగానే రూ.3 లక్షలకు కుదించడం మహిళలను మోసం చేయడం కాదా అంటూ ఎద్దేవా చేశారు. రూ.3 లక్షలకు కూడా సున్నా వడ్డీ కేంద్రమే ఇస్తుందని, ఇంక మహిళా లోకానికి జగన్మోహన్ రెడ్డి వెలగబెట్టింది ఏముందని, 45 ఏళ్లకే పెన్షన్ పేరుతో మహిళలకు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నాలుక మడతేసి చేయూత అంటూ జగన్ దగా చేసి, రూ.1.80 లక్షలు అందాల్సిన సాయానికి గండికొట్టాడని, తెలుగు రాష్ట్రాల్లో మహిళలు సాగిస్తున్న ప్రగతి పథానికి తెలుగుదేశం ప్రభుత్వం వేసిన పునాదులే కారణమని, మహిళలకు ఆస్తిహక్కు, రాజకీయంగా 9% రిజర్వేషన్లు, స్థానిక సంస్థలు, కళాశాలలు, ఉద్యోగాల్లో 33% రిజర్వేషన్లు అమలు చేసింది తెలుగుదేశమేనని అన్నారు. రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో మహిళాభివృద్ధి, సాధికారతకు అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.

## ఎన్నికల్లో నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**- సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** వచ్చే సార్వత్రిక ఎన్నికలలో నిర్భయంగా ఓటర్లు అందరూ నిర్భయంగా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రంపచోడవరంలో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నుండి ర్యాలీ ప్రారంభించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో వివిధ కళాశాలల విద్యార్థులు, పాఠశాల విద్యార్థులతో సబ్ కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్థానిక లెనోరా కళాశాల ప్రాంగణంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సబ్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరు గుర్తింపుకార్డుకు దరఖాస్తు చేసుకున్న వారందరి దరఖాస్తులు పరిశీలించి ఓటరు కార్డులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఓటరు గుర్తింపుకార్డులు ఉన్నవారందరికీ ఈవీఎంలపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అబూ సలాం మాట్లాడుతూ నియోజకవర్గంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్ కార్డుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈవీఎంలపై అవగాహన చాలా ముఖ్యమని ఆయన అన్నారు. రంపచోడవరం మొబైల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఫారం 6 పూర్తిచేసి, బిఎల్ఓ లకు అందజేస్తే పరిశీలించి ఓటర్ కార్డు మంజూరు చేస్తారన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ఇవి ఏం లు ద్వారా జరుగుతాయని, అదేవిధంగా ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన చాలా ముఖ్యమని ఆయన తెలిపారు. రంపచోడవరం సిఐ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు జరిగినా పగడ్బందీగా బందోబస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఓటర్‌కార్డులు ఉన్న ప్రతీ పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

అనంతరం రంపచోడవరం పంచాయతీలో బాగా పనిచేసిన సుధా ప్రకాష్‌కు, కొత్తగా ఎక్కువ ఓటర్లు నమోదు చేయించిన పిఎస్ నెంబర్ 220 బిఎల్ఓ యం.ఆనందీశ్వరరావు బోలకొండకు, పిఎస్ నెంబర్ 187 ఎస్.కె. భాష చిలకమామిడికి, పిఎస్ నెంబర్ 261 సిహెచ్ రమాదేవి ఊట్ల, అదేవిధంగా 18, 19 సంవత్సరాల వయసు గలవారిని ఎక్కువగా ఎన్‌రోల్‌మెంట్ చేసిన పిఎస్ నెంబర్ 191 కె.చిన్నారెడ్డి కొయ్యలగూడెంకు, పిఎస్ నెంబర్ 219 యం.రామ తులసి చెరువూరుకు, పిఎస్ నెంబర్ 207 జి. లీలా ప్రభాకర్‌రావుకు సబ్ కలెక్టర్ చేతులు మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. సీనియర్ సిటిజనులను పూలమాలలు, శాలువాలతో సన్మానించడం జరిగింది. అదేవిధంగా ఓటరు గుర్తింపు కార్డులు పొందిన వికలాంగులకు సబ్ కలెక్టర్ శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంపచోడవరం తాహసిల్దార్ పి.వి.జె. కుమార్, డిప్యూటీ తాసిల్దారులు ఎన్.వి.వి. సత్యనారాయణ, బి.రాజు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్లు డి.ఇందిరా బాయి, టి.లక్ష్మణరావు, మణికంత, అడిషనల్ ఎస్ఐ ఎం.ఆర్.కె.రాజు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# షర్మిల విశ్వాసం చూరగొనేనా ?

**- తెలంగాణ కోడలినంటూ సొంత పార్టీ... మూణ్ణాళ్ళకే కాంగ్రెస్‌లో విలీనం**

**- అప్పట్లో కాంగ్రెస్‌పై వాడి వేడి విమర్శలు... ఇప్పుడు అదే కాంగ్రెస్‌కి భజన**

**- ఏపీపై గతంలో 'ఆ రాష్ట్రంతో మాకేం సంబంధం' అన్న షర్మిల**

**- ఇప్పుడు అదే ఏపీని ఉద్ధరించేది మేమేనంటూ పర్యటనలు**

**- గతంలో జగన్ కోసం...ఇప్పుడు జగన్ కు వ్యతిరేకంగా విమర్శలు**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** వై.ఎస్.షర్మిల...వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చెల్లెలిగా...జగన్ జైలులో ఉన్న సందర్భంలో తాను అన్న వదిలిన బాణం అంటూ అనాడు కాంగ్రెస్‌పై విమర్శిస్తూ చేసిన విస్తృతస్థాయి పర్యటనలు నేటికీ ప్రజల మనసుల నుంచి తొలిగిపోలేదు. ఈ క్రమంలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన వై.ఎస్.షర్మిల...ఒకప్పుడు తాను విమర్శించిన కాంగ్రెస్ పార్టీ కోసం నేడు తన అన్న జగన్‌మోహన్‌రెడ్డిపై, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీపై విమర్శల బాణాలు ఎక్కుపెడుతుండటం పట్ల ప్రజలు విస్తుపోతున్నారు. అప్పట్లో అటు కాంగ్రెస్, ఇటు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. రాష్ట్ర విభజన అనంతరం..ఏదో ఒక రాష్ట్రాన్ని ఎంచుకోవాల్సి వచ్చిన సందర్భంలో వైకాపా ఏపీకే పరిమితమైంది. తెలంగాణను పక్కన పెట్టింది. కానీ, షర్మిల తొలుత ఏపీని వదిలేసి.. 'ఆ రాష్ట్రంతో మాకేం సంబంధం ' అని వ్యాఖ్యలు చేసి.. ఇప్పుడు అదే రాష్ట్రాన్ని ఉద్ధరిస్తానంటూ రావడం వెనుక ఉన్న మర్మం ఏంటో కూడా ప్రజలకు చెప్పాల్సి ఉంది. అన్యాయంగా రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్..ఏపీలో మాత్రం ఆ పాపం మాది కాదు అంటూనే, తెలంగాణలో మాత్రం మేమే మీకు తెలంగాణ ఇచ్చాం అంటూ నిస్సంకోచంగా చెప్పుకుంటూ అధికారంలోకి రాగలిగింది. ఆంధ్ర ప్రాంత ప్రజల మనోభావాలు, సమస్యలు పట్టకుండా విభజించిన కాంగ్రెస్ గురించి నేడు షర్మిల మీకు న్యాయం చేసేది మేమే అంటున్నా, ఆనాటి గాయాలు ప్రజల్లో ఇంకా మానలేదు అనేది సత్యం. ఈ నేపథ్యంలో...వైసీపీని టార్గెట్ చేసుకుని, విమర్శలతో షర్మిల చేస్తున్న పర్యటనలు, వైసీపీ పాలనపై షర్మిల దూకుడు ఆమెకు కానీ కాంగ్రెస్ పార్టీకి కానీ.. ఏమేరకు ప్రయోజనం చేకూరుస్తుందనే చర్చ సాగుతోంది. ఎందుకంటే.. గత ఐదేళ్ల కిందట ఇదే వైసీపీ కోసం.. ఇదే జగన్ కోసం.. ఆమె పాదయాత్ర చేసింది. ఈ విషయాలేవీ ప్రజల మనసుల నుంచి తొలిగిపోలేదు. పైగా.. అసలు జగన్‌తో ఎందుకు విభేదించాల్సి వచ్చింది? పొరుగు రాష్ట్రంలో సొంత పార్టీ పెట్టుకుని.. దానిని కాంగ్రెస్‌లో ఎందుకు విలీనం చేయాల్సి వచ్చింది? ఇప్పుడు ఏపీలో ఎందుకు అడుగులు వేయాల్సి వచ్చింది? అనే ప్రశ్నలకు ఆమె సమాధానం చెప్పాల్సి ఉంటుంది.తెలంగాణ కోడలినంటూ.. వైఎస్ బిడ్డనంటూ..తెలంగాణలో రాజన్న రాజ్యం ఏర్పాటు చేస్తానంటూ సొంతంగా పార్టీ పెట్టుకుని, పాదయాత్రలు చేసి, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలు కూడా ఆమెకు బ్రహ్మరథం పడుతున్న సందర్భంలో..ఒకప్పుడు కాంగ్రెస్‌ను చెడా మడా తిట్టిన షర్మిల..ఆ పార్టీలో తన పార్టీని విలీనం చేసి, ప్రజలు విస్తుపోయేలా చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ఛీఫ్ గా ఏపీలో అధికార, ప్రతిపక్షాలపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టడం, విమర్శించడమే ధ్యేయంగా షర్మిల పర్యటనలు సాగుతున్నాయి. గత ఐదేళ్ల ముందు వైసీపీ కోసం పనిచేసి, ఇదే కాంగ్రెస్‌ను చడా మడా తిట్టిపోసిన షర్మిల.. ఇప్పుడు యూటర్న్ తీసుకుని ప్రజల మధ్యకు వచ్చి అదే కాంగ్రెస్‌ను కీర్తిస్తూ, వైసీపీని విమర్శిస్తున్ననేపథ్యంలో ప్రజల్లో పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

## ఓటు ప్రాధాన్యతను గుర్తించండి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా**

**- కాకినాడలో జాతీయ ఓటర్ల దినోత్సవం**

**- పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎస్పీ, కౌడ ఛైర్‌పర్సన్, కమిషనర్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** యువత ఓటు విలువను గుర్తించి ఖచ్చితంగా వినియోగించుకునేలా చైతన్యవంతులు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రం కాకినాడలో ఘనంగా నిర్వహించారు. తొలుత పీఆర్ కళాశాల నుంచి స్మార్ట్‌సిటీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్మార్ట్‌సిటీ మీటింగ్‌హాలులో జరిగిన ఓటర్ల దినోత్సవ సభను ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తదితరులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటును పొందడంతోపాటు వినియోగించుకోవడం అత్యంత ప్రధానమని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఆన్‌లైన్‌లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. ఒక్క ఓటు కూడా మన భవితవ్యాన్ని మారుస్తుందని, అందువల్ల ఓటు విలువను ప్రతీ ఒక్కరు గుర్తించాలన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ మాట్లాడుతూ పౌరులంతా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఆ దిశగా పోలీసు యంత్రాంగం తరుపున తమ వంతు తోడ్పాటు ఉంటుందన్నారు. కాకినాడ నగరపాలకసంస్థ కమిషనర్ సి.హెచ్. నాగనరసింహారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఒక ఆయుధమన్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో అత్యధికంగా దాదాపు లక్షా 10వేల ఓటరు దరఖాస్తులను పరిష్కరించి ఎంతో మంది యువ ఓటర్లను చేర్పించామన్నారు. ఇప్పటికీ కొత్త ఓట్లు నమోదు చేసుకునే అవకాశం ఉందని, దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు అతిధులు బహుమతి ప్రధానం చేశారు. ఓటు ప్రాధాన్యతను తెలియజెప్పే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎటువంటి ఒత్తిడులకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేస్తామని అక్కడకు వచ్చిన యువతతో ప్రతిజ్ఞ చేయించారు. సుమారు ఆరుగురు సీనియర్ ఓటర్లను, ఓటర్ల సంక్షిప్త సవరణ సర్వే- 2024 లో ఉత్తమ సేవలందించిన పలువురు ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీలలో గెలుపొందిన పీఆర్ కళాశాల విద్యార్థిని దీప్తి ప్రియాంక ఓటు విలువ తెలియజెప్తూ ఇచ్చిన ప్రసంగం ఆకట్టుకుంది. సమావేశంలో కొత్త ఓటర్‌కార్డులను పంపిణీ చేశారు. ఓటు విలువను తెలియజెప్పే ప్రచార వాహనాన్ని ఎమ్మెల్సీ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు తిలకించారు.సమావేశంలో విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ జి.అబ్బయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే సత్యనారాయణ, తహసీల్దార్ దొర వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కార్యక్రమానికి హాజరయ్యారు.

### ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్, యూబీఏ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు పై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో "మన ఓటు- మన బాధ్యత" అనే నినాదంతో రంగోలి పోటీలు, ఓటు ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఆసక్తికరమైన రంగవల్లికలతో అవగాహన పెంపొందించే ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని, 18 సంవత్సరాలునిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని అన్నారు. ఓటు హక్కు పై అవగాహన పెంపొందించడానికి రంగోలి, వ్యాసరచన పోటీలు నిర్వహించామని తెలిపారు.పోటీలవిజేతలకు ప్రశంస పత్రాలను మరియు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్ర మాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలలసెక్రెటరీడాక్టర్‌నల్లమిల్లిసుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళా శాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ , క్యాంపస్ ఇంచార్జ్ మూర్తి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఅధికారులు తేజేశ్వర రావు, దివాకరరావు,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


**ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్**

Regd No. ABC-CS/006/2015

**(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ)**

**పబ్లిక్ నోటీసు**

ఈ ప్రకటనలోనివారి తాలూకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్థి పై సొసైటీ నందు తనఖా పెట్టి సొసైటీ నుంచి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖా పై సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపుగా లిఖితపూర్వకంగా అభ్యంతరములను అక్నాలెడ్జ్‌మెంట్‌తో రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా బ్యాంకుకు తెలియపరచవలసినదిగా కోరుతున్నాము.

| వ.నెం. | పేరు | స్థిరాస్థి వివరములు |
|---|---|---|
| 1. | Sri. Varanasi Venkata Surya Satya Nageswara Sarma<br>S/o V. Jagannadha Sarma<br>GL.No: 78777<br>Old D.No:12-2-15A, New D.No: 12-2-15E, Baru Vari Veedhi, Ward No:12, Block No:2, Pithapuram - 533450.<br>Ph.No: 9951552811/ 7396555567. | An extent of 129.5 sq.yds or 108.279 sq.mtrs vide doc.No : 189/2009 of house site with RCC Roofed Ground Floor and First floor building situated at Pithapuram R.S.No: 250/1, Assisment No: 1063010061.<br>Old D.No: 12-2-15A, New D.No: 12-2-15E, Baru Vari Veedhi, Ward No: 12, Block No: 2, Pithapuram - 533450.<br>Value of Rs.26 lakhs. |

Kakinada
22.01.2024

**Branch Manager**
P.S.N.M.Srikanth
Cell : 9281029464/9885547599



**పాస్‌పోర్ట్ పోయింది**

అద్దంకి వెంకటేశ్వరరావు అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్ట్ కార్యాలయం అధికారులు ది.**17-10-2002**న E**3709594** నెంబర్ గల పాస్ పోర్ట్ మంజూరుచేసారు.సదరు పాస్‌పోర్ట్ కొవ్వూరు మెయిన్‌రోడ్‌లో జిరాక్స్ తీయించుకొనుటకు వెళుతుండగా **22-01-2024**న నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. గాన, నాపాస్ పోర్ట్ ఎవరికి అయినా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించ గలరని కోరుతున్నాను.

**అడ్రస్...**
అద్దంకి వెంకటేశ్వరరావు, S/o రాజారావు
డోర్ నెంబర్ **4-5-33/4**
వేగివారి చావిడి,కొవ్వూరు
ఫోన్ నెంబర్ **7993875299**

## ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డికి ఆర్యవైశ్య సంఘం ఆత్మీయ సన్మానం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ విప్, కోతపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని గురువారం ఆర్య వైశ్య సంఘము ఘనంగా సన్మానించింది. వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆర్యవైశ్యులు వెంకటేశ్వర వాసవి నిత్య నిత్యాన్నదాన ట్రస్ట్ సత్రం ఏర్పాటు చెయ్యగా, ట్రస్టుకు రహదారి కావాలని కోరిన వెంటనే ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్పందించి ప్రభుత్వ అధికారులు, పెద్దలతో మాట్లాడి రహదారి ఏర్పాటుకు ప్రత్యేక జీవో తీసుకురావడంతో, ఆయనకు కృతజ్ఞతగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళపు శివరామ సుబ్రహ్మణ్యం, రుద్ర రాజు రమేష్‌రాజు, బోనం సాయిబాబా, కనుమూరు శ్రీనివాసరాజు, ముదునూరి రామరాజు, కొరుప్రోలు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## శ్రీనివాసరావుకు ఆంధ్ర యువ సేవారత్న అవార్డు

**– అభినందించిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్**



**అల్లవరం, మేజర్ న్యూస్ :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా, న్యూ ఢిల్లీ వారు ఆధ్వర్యంలో అల్లవరం మండలం యెంట్రుకోన గ్రామ సర్పంచ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్ ల సమాఖ్య సభ్యులు తిక్కిరెడ్డి నాగ వెంకట శ్రీనివాసరావుకి ఆంధ్ర యువ సేవారత్న అవార్డు లభించడం పట్ల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శ్రీనివాసరావును అభినందించారు. కరోనా సమయంలో శ్రీనివాసరావు అల్లవరం మండలం ప్రజలకు అందుబాటులో ఉంటూ మానవత దృక్పదంలో అనేక సేవ కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. ఎప్పుడూ సమాజ సేవలో ముందు ఉండే శ్రీనివాస్‌కి ఆంధ్ర సేవా రత్న అవార్డు రావడం మన జిల్లాకే గర్వకారణమని అభినందనలు తెలియజేశారు.

# 14వ జాతీయ ఓటరు దినోత్సవ శుభాకాంక్షలు

**-ఎన్నికల సిబ్బంది, బిఎల్ఓలకు ప్రోత్సాహక అవార్డు ప్రధానం**
**-ఆకట్టుకున్న ఓటరు చైతన్య సాంస్కృతిక కార్యక్రమాలు, నాటిక**
**-మన భవిష్యత్‌ను, తలరాత మార్చే ఒకే ఒక్క ఆయుధం ఓటు**
**-ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు**
**-సీనియర్ ఓటర్లకు సత్కారం**
**-కలెక్టర్ మాధవీలత**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఓటు హక్కు మనకు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం, ప్రతి ఒక్కరూ అమూల్యమైన ఓటు హక్కు ను తప్పనసరిగా వేసి, తమను పరిపాలించే ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీ లత విజ్ఞప్తి చేశారు. గురువారం ఆనం కళా కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక , అవార్డ్ ప్రధానోత్సవ , విద్యార్థులకు బహుమతుల ప్రాధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, రిపబ్లిక్ దినోత్సవం ఎంత వేడుకగా జరుపు కుంటామో, అంతే వేడుకగా ఓటరు దినోత్సవం జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ , రిపబ్లిక్ దినోత్సవం ఎంత వేడుకగా జరుపుకుంటామో, అంతే వేడుకగా ఓటరు దినోత్సవం జరుపుకోవాలని పేర్కొన్నారు. హక్కుల కోసం అడిగే అవకాశం ఓటు హక్కు వినియోగించు కునే వారికే ఉంటుందని , ఓటు వేయడానికి నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. లాలా చెరువు స్కూల్ విద్యార్థులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఓటర్లు ఓటు వేయడంలో నిర్లిప్తత ప్రదర్శించే విధానం కళ్ళకు కట్టినట్లు చూపించారని



మెచ్చుకున్నారు. పిల్లలు వారి తల్లితండ్రులు, చుట్టుపక్కల వాళ్ళు ఓటు వేసేలా చూడాలని, మనల్ని 5 ఏళ్లు పాటు పాలించే వారిని ఎన్నుకునే అవకాశం మనకు ఉందని తెలిపారు. ప్రజా స్వామ్య వ్యవస్థ లో ఓటు ఒక వజ్రాయుధం అని పేర్కొన్నారు. మనకు రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం మంచి ప్రభుత్వాలను ఎన్నుకోవడం ముఖ్యం అన్నారు. మనకు ఓటు హక్కు కల్పించడం కోసం లక్షలాది ఉద్యోగులు సిబ్బంది కలెక్టర్ నుంచి గ్రామ స్థాయి వరకు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఓటు మన సామాజిక బాధ్యతన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ స్ఫూర్తితో నేడు సామాజిక న్యాయ సమతా ర్యాలీని జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జరుపుకోవడం అంబేద్కర్‌కి ఘనమైన నివాళిగా పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ , మనకు బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఉండడం వల్ల మిగతా అన్ని ప్రజాస్వామ్య దేశాల కంటే ఎక్కువ అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. పారదర్శకంగా, ఖచ్చితత్వం తో ఓటరు నమోదు, పోలింగ్ ప్రక్రియ చేపట్టడం ఒక ప్రధాన కారణం అని పేర్కొన్నారు. ఓటు హక్కు, దాని యొక్క ప్రాధాన్యత ను ప్రతి ఒక్క పౌరుడు తప్పని సరిగా తెలుసుకోవాల్సి ఉందన్నారు. ఓటు హక్కు కలిగిన ఉన్నా వారు ఓటు వేయడం, ఓటు హక్కు కోసం అర్హత కలిగిన వారు ఓటరు గా నమోదు కావడం చాలా ముఖ్యం అన్నారు. ఇందు కోసం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆధ్వర్యంలో గత 9 నెలలుగా ఎంతో పని చెయ్యడం జరిగిందన్నారు. ఇందులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నా. నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 96 వేల దరఖాస్తులు పరిష్కారం చెయ్యడమే తార్కాణం అన్నారు. ఓటు మన హక్కు, తప్పకుండా ఎన్నికల్లో ఓటు వేద్దాం అని దినేష్ కుమార్ తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి జీ. నరసింహులు, అదనపు ఎస్పీ జి. వేంకటేశ్వర రావు , జిల్లా విద్యా అధికారి ఎస్. అబ్రహం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కే ఎస్ జ్యోతి, అదనపు కమిషనర్ పి ఎం. సత్య వేణి, డి ఐ ఓ జేవీఎల్ సుబ్రమణ్యం , జిల్లా సంక్షేమ అధికారి ఎం. సునీల్, వివిధ స్కూల్స్ విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ స్కూల్స్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎన్నికల సిబ్బందికి బి ఎల్ ఓ లకు అవార్డులు , వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఓటర్ అయిన కోటికెలపూడి శ్రీరామచంద్ర మూర్తి తదితరులను కలెక్టర్ శాలువా, పూలదండలతో సత్కరించారు.

## ఘనంగా ఓటరు దినోత్సవం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఓటర్దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 25న ప్రభుత్వం ముసాయిదా ఓటర్ లిస్ట్ విడుదల చేయడంతో జిల్లాలో సుమారు 23 వేల మంది కొత్త ఓటర్ లు నమోదు అయ్యారు. పాలకులను ఎన్నుకునే ప్రజాస్వామ్య బద్దంగా జరిగే సార్వత్రిక ఎన్నికల్లో యువత ఉత్సాహంగా పాల్గొనేలా రెవిన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఓటర్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మెర్లపాలెం గ్రామంలో సర్పంచ్ మెర్ల రాము పాల్గొని మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. యువత పలు గ్రామాల్లో ప్రతిజ్ఞలు చేశారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి జరగాలంటే ప్రజల సహకారం అవసరమని ముసురుమిల్లి ఎంపీటీసీ కుంజం వంశీ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం తామరపల్లి గ్రామ పంచాయతీ సచివాలయంలో సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముసురుమిల్లి ఎంపీటీసీ కుంజం వంశీ మాట్లాడుతూ ముందుగా అందరికీ జాతీయ ఓటర్ల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. మన పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో ప్రతీ ఒక్కరు ఇంటి పన్నులు కట్టాలని కోరారు. పంచాయతీ అభివృద్ధి పరచడంలో ప్రతీఒక్కరూ బాధ్యత తీసుకొని అభివృద్ధి పరచాలని, అంతే కాకుండా ప్రతీ గ్రామంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, దాన్ని సరిచూడాల్సిన బాధ్యత పంచాయతీ నిర్వాహకులపై ఉందన్నారు. గ్రామంలో ఏ మంచి పనులు చేయాలన్నా ముందుగా గ్రామస్తుల సహకారం ఉండాలని సూచించారు. అనంతరం గ్రామంలో వాటరు లికేజీని పంచాయతీ కార్యదర్శి చూపించగా రెండు రోజుల్లో చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చిట్టిదొర, కార్యదర్శి భారతి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## దళిత సింహగర్జన విజయవంతం చేయాలంటూ బైక్ ర్యాలీ



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** జగన్మోహన్ రెడ్డి పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దళితులపై దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా పథకం దూరమయ్యాయని, దీనివలన దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని జివి హర్షకుమార్ మండిపడ్డారు.. వచ్చే నెల 11వ తేదీన హర్ష కుమార్ యువసేన ఆధ్వర్యంలో జరిగే దళిత సింహ గర్జన విజయవంతం చేసేందుకు రాజమండ్రి నుండి బైక్ ర్యాలీ చేపట్టారని అన్నారు. దీనిలో భాగంగా అంబాజీపేట బస్టాండ్ సమీపంలో జివి హర్ష కుమార్ మాట్లాడుతూ హర్ష కుమార్ యువసేన ఆధ్వర్యంలో జరిగే దళిత సింహ గర్జనను విజయవంత చేసేందుకు తాను ర్యాలీలో పాల్గొంటున్నానని తెలిపారు. రాజమహేంద్రవరం నుండి ప్రతీ గ్రామంలో బైక్ ర్యాలికి ఘనస్వాగతం లభించిందని అన్నారు. ఈ దళిత సింహగర్జనలో దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తామని, ఫిబ్రవరి 11న జరిగే దళిత సింహగర్జనలో దళితుల గుండెచప్పుడు వినిపిస్తామని అన్నారు. అనంతరం అధిక సంఖ్యలో పాల్గొన్న యువత మోటార్ బైక్ ర్యాలీగా పి.గన్నవరం బయలుదేరి అమలాపురం, ముమ్మిడివరం, తాళ్ళరేవు, మీదుగా వెళుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.వి. శ్రీరాజ్, బీర సురేష్, నూకపెయ్యి చిన్నా, కోట గోపి, మాత సత్యనారాయణ, గోసంగి సత్యనారాయణ, కొల్లి శ్రీనివాసు, కత్తుల విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నివీర్‌లో రిజిష్టర్ చేసుకోండి..వాయు సేనలో చేరండి



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** సికిందరాబాద్ లోని 12వ ఎయిర్ మెన్ సెలక్షన్ సెంటర్ నుండి వాయుసేన్ అధికారులు మూడు రోజులు పాటు జిల్లాలోని వివిధ కళాశాలలోని అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి, "అగ్నివీర్ – వాయు" పథకం ద్వారా వాయు సేనలో చేరే అవకాశాన్ని వినియోగించు కోవలసినదిగా కోరారు. సార్జంట్ అనిల్ గోస్వామి మరియు సార్జంట్ జీవన్ సింగ్ లు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు డి.వి. రమణమూర్తి ఆధ్వర్యములో సంక్షేమ అధికారులు ప్రసాద్ బాబు, శేషు కుమార్ లు ఈ అవగాహన కార్యక్రమాన్ని సమర్పించారు. ఈ పథకమునకు ఆన్‌లైన్‌లో https:agnipathvayu.cdac.in వెబ్ సైట్ నందు 06.02.2024 సాయంత్రం 11.00 గం. లోపు నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో పరీక్ష తేది మార్చి 17వ తేదీన ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ & పరీక్ష రుసుము రూ. 550+జిఎస్టీ అని తెలిపారు. అభ్యర్థి తేదీ 02.01.2004 మరియు 02.07.2007 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ప్రవేశ స్థాయి అర్హత, వైద్య ప్రమాణాలు, నిబంధనలు & షరతులు, ఆన్లైన్ దరఖాస్తులను పూరించడానికి సూచనలు మరియు నమోదుపై వివరణాత్మక సమాచారం కోసం https:agnipathvayu.cdac.in నందు సంప్రదించాలని తెలియజేశారు.

## చిత్తడి నేలలు సాంస్కృతిక వారధులు

**– ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** చిత్తడి నేలలు సాంస్కృతిక వారధులుగా నిలుస్తాయని శాసన మండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్, అటవీశాఖ మరియు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి 25వ తేది వరకు నిర్వహిస్తున్న చిత్తడి నేలల సంరక్షణ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక సాలిపేట పైండా సత్తిరాజు బాలికల మున్సిపల్ బాలికోన్నత పాఠశాల నందు ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ చిత్తడి నేలలు సాంస్కృతిక వారథులన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానివేయాలని, పర్యావరణహితమైన అలవాట్లను అవలంబించాలని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సామాజిక వనాలను అభివృద్ధి చేయాలన్నారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి మాట్లాడుతూ చిత్తడి నేలలు తుఫానులు, సునామీలన నుంచి రక్షిస్తాయన్నారు. విషపూరితమైన కాలుష్యకారకాలకు వ్యతిరేకంగా సహజ వడపోతగా పనిచేస్తుందని ఆమె తెలిపారు. జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ డైరెక్టర్ కె.వి.ఎస్.జి మురళీకృష్ణ మాట్లాడుతూ మడ అడవులు సముద్ర తీరానికి సహజసిద్ధ రక్షణ గోడలుగా ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మంచి వ్యక్తిత్వంతో అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయ కర్త కె.వి.కే మహేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు వివిధ పాఠశాలల్లో, వివిధ ప్రాంతాలలో చిత్తడి నేలలపై అవగాహన కార్యక్రమాలను నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు పి.స్రవంతి ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం జిల్లాస్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కాకినాడ ఉప విద్యాశాఖ అధికారి ఆర్.జె.డేనియల్ రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, మండల విద్యాశాఖ అధికారులు వి.పి. జి.వాణీ కుమారి, సి.హెచ్. రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని జె.సుబ్బలక్ష్మి, బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా అకడమిక్ సమన్వయకర్త కె.వెంకట్రావు, ఎమ్.వెంకట శివరామకృష్ణ, గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యంగిర హెూమం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం క్షేత్ర పాలకురాలైన శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యంగిర హెూమం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున నిర్వహించే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు , గ్రామస్తులు పాల్గొని పూజలు చేశారు. వైదిక కమిటీ సభ్యులు పురోహితులు అర్చకుల ఆధ్వర్యంలో జరిపించే ప్రత్యంగిరా హెూమం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సుదీర్ఘంగా రెండు గంటలపాటు నిర్వహించారు. పూజలో అన్ని రకాల పండ్లు పూజా ద్రవ్యాలు కలిపి మూటగట్టి పూర్ణాహుతితో అగ్ని దేవునికి సమర్పించి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## కులగణన ప్రక్రియ ప్రారంభించిన వారం రోజుల్లో 89 లక్షల కుటుంబాల్లోని కోటి 98 లక్షల మంది డేటా సేకరించాం

**-ప్రజల జీవన, సామాజిక స్థితిగతులను సమగ్ర సమాచారం కూడిన డేటాను సేకరించేందుకు కులం గణన ప్రక్రియ**
**-సామాజిక న్యాయానికి చిరునామా ఆంధ్రప్రదేశ్ -మంత్రి వేణుగోపాలకృష్ణ**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరిగే జనగణనలో కులగణను కూడా చేర్చాలని గత ఏడాది కాలంగా అసెంబ్లీ శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఏకగ్రీవంగా తీర్మానించి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం కొరకు ప్రతిపాదనలను పంపడం జరిగిందని జిల్లా ఇన్చార్జ్ మంత్రి బీసీ సంక్షేమం రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు సినిమా ఫోటోగ్రఫీ రాజమండ్రి రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు.

గురువారం రాజమండ్రి పట్టణంలోని 18వ వార్డు కప్పల వారి వీధిలో గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పర్యటిస్తున్న జిల్లా ఇన్చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ కులగణన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ దేశంలోని పౌరులందరూ కుల గణన జరగాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరిగే జనగణనలో కులగణను కూడా చేర్చాలని గత ఏడాది కాలంగా అసెంబ్లీ శాసన సభ సమావేశాల్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఏకగ్రీవంగా తీర్మానించి ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందని పేర్కొన్నారు. కానీ ఇంకా కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్త పరచలేదని తెలిపారు. పేదరికం నిర్మూలించి, వారి ఆత్మగౌరవ రక్షణ కొరకు సీఎం జగన్మోహన్ రెడ్డి నవరత్నాల్లో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదవాని ఆర్థిక అభివృద్ధికి వాటి ప్రయోజనా లను అందిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని కులాల వారు జీవనస్థితిగతులు, విద్య ఆర్థిక సామాజిక స్థితిగతులతో సమగ్ర సమాచారం కూడిన డేటాను సేకరించేందుకు కులం గణన ప్రక్రియను ప్రారంభించుకున్నామన్నారు. సామాజిక న్యాయాన్ని గడచిన పాలకులు ఎండమావిగా చేస్తే నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామాజిక న్యాయ శిల్పం ఆవిష్కరణ రోజైన జనవరి 19వ తేదీ నుంచి కులగణన ప్రక్రియను ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి చిరునామా ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 19 వ తేదీ నుంచి ప్రారంభించిన కుల గణన ప్రక్రియ వారం రోజుల్లో 89 లక్షల కుటుంబాల్లోని కోటి 98 లక్షల మందిని కులగణన సర్వే చేశారన్నారు. సమగ్ర కులగణన సాధకుడుగా సీఎం జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలుస్తారని అన్నారు. ఈనెల 29 తేదీ నాటికి కులగణన ప్రక్రియ పూర్తవ్వాలనే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అవసరం మేరకు మరో పది రోజులు పొడిగించనున్నా మన్నారు. అనేక బీసీ సంఘాలు ఎస్సీ సంఘాలు కోరిక మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కులగణన ప్రక్రియను ప్రారంభించి సర్వే ప్రక్రియను అమలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. కులగణన ప్రక్రియ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఏప్రిల్ 11 వ తేదీన అనౌన్స్ చేయడం జరిగిందని ఆ ప్రక్రియను బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక న్యాయ శిల్పం ఆవిష్కరణ రోజున ప్రారంభించామని మంత్రి అన్నారు.

కార్యక్రమంలో మంత్రి వెంట నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ ఏ. వినూత్న, నగరపాలక సంస్థ అధికారులు సిబ్బంది, మిందే నాగేంద్ర, కుప్పినీడి ప్రసాదు బాబు ( రాజమౌళి), 17వ వార్డు ఇంచార్జ్ చిగురుమిల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.




## ఆదివారం హంగామా..

**– వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ భగవంత్కేసరి, డ్యాన్స్ రియాలిటీ షో సూపర్ జోడీ ప్రారంభం**
**– జనవరి 28న మీ జీ తెలుగులో..!**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తెలుగు ప్రేక్షకులకు సరికొత్త కాన్సెప్ట్‌తో అలరించే జీ తెలుగు ఈ ఆదివారం మరింత వినోదం అందించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న యాక్షన్ ఎంటర్టైనర్ భగవంత్ కేసరి సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ఈ ఆదివారం అందిస్తోంది. అంతేకాదు, తెలుగు ప్రేక్షకులను బుల్లితెర, వెండితెరపై అలరిస్తున్న తారలు తమ జోడీతోకలిసి జంటగా తమలోని ప్రతిభను నిరూపించుకునేందుకు సూపర్ జోడీవేదికను అందిస్తోంది జీ తెలుగు. నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ హిట్ భగవంత్కేసరి ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు మరియు మెగాప్రిన్స్ వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగాసూపర్ జోడిప్రారంభం, ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, జీతెలుగులో మాత్రమే..! సక్సెస్ఫుల్ నాన్ఫిక్షన్ షోలతో అలరించిన జీ తెలుగు ఈఆదివారం సెలబ్రిటీ డ్యాన్స్ రియాలిటీ షో సూపర్ జోడిని ప్రారంభిస్తోంది. జీ తెలుగులో జనవరి 28న టాలీవుడ్హీరో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగా ప్రారంభం కానున్న సూపర్ జోడీ ప్రతిఆదివారం రాత్రి 9గంటలకు ప్రసారం కానుంది. చాలా రోజుల గ్యాప్ తర్వాత ప్రముఖ యాంకర్ ఉదయ భాను జీతెలుగు సూపర్ జోడి షోతో రీఎంట్రీ ఇవ్వనున్నారు. ఈ షోకి న్యాయనిర్ణేతలుగా ఎవర్గ్రీన్నటి మీనా, ప్రముఖ కొరియోగ్రాఫర్ రఘుమాస్టర్, హీరోయిన్శ్రీదేవి విజయ్ కుమార్ వ్యవహరించనున్నారు. ప్రేక్షకులను మెప్పించి బ్లాక్బస్టర్ హిట్గా నిలిచినభగవంత్ కేసరి సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా జీ తెలుగు అందిస్తోంది. అనిల్రావిపూడి దర్శకత్వంలో రూపొందినఈ సినిమా కథ జైలు నుండి విడుదలైన మాజీ పోలీస్అధికారి నేలకొండ భగవంత్ కేసరి(బాలకృష్ణ) పాత్ర చుట్టూ తిరుగుతుంది. ఈ సినిమాలోనందమూరి బాలకృష్ణ, కాజల్ అగర్వాల్, శ్రీలీలప్రధానపాత్రల్లో నటించగా అర్జున్ రాంపాల్, పి.రవిశంకర్, ఆర్. శరత్ కుమార్, రఘుబాబుఇతర కీలకపాత్రల్లో నటించారు. యాక్షన్, ఎమోషన్స్,కెమిస్ట్రీ అన్నింటి మేళవింపుగా సాగిన భగవంత్ కేసరి సినిమా వరల్డ్ టెలివిజన్ప్రీమియర్గా మీ జీ తెలుగులో ఈ ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రసారంకానుంది. ఈ సందర్భంగా జీ తెలుగు 'బనావో బేటీకో షేర్' కాంటెస్టన్నినిర్వహించనుంది. ఈ పోటీలో విజేతలుగా నిలిచిన వారు సర్ప్రైజ్ గిఫ్ట్లు పొందుతారు. భగవంత్ కేసరిసినిమా చూడండి.. మీరు కూడా ఈ పోటీలో పాల్గొనండి, మీ జీ తెలుగులో!

## ఆర్డీవో సుధాసాగర్‌కి మోడరన్ ఫౌండేషన్ ప్రజాహిత అవార్డు ప్రధానం




**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ, సామాజిక, రాజకీయ, క్రీడా, కళ, సేవా, విద్యారంగాలలో విశిష్ట సేవలు అందించేవారికి గత రెండున్నర దశాబ్దాలుగా మోడరన్ ఫౌండేషన్ వివిధ ప్రతిష్టాత్మక అవార్డులు ఇస్తున్న నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్ కి మోడరన్ ఫౌండేషన్ తరపున మోడరన్ విద్యాసంస్థల అధినేత లయిన్ జి.వి.రావు ప్రజాహిత పురస్కారాన్ని గురువారం ఆర్డిఓ ఆఫీస్ లో జరిగిన ఓటర్ దినోత్సవ సభలో అందజేసారు. ఈ సందర్భంగా జి.వి.రావు మాట్లాడుతూ ఆర్డివోగా విధులు స్వీకరించిన అనతి కాలంలోనే సుధాసాగర్ ప్రజా సమస్యలపై చురుగ్గా స్పందించి పరిష్కరిస్తూ అందరి మన్ననలు పొందారని, ప్రజాస్వామ్య దేశానికి పండుగైన ఓటర్ దినోత్సవం నాడు ఈ అవార్డు అందజేయడం సబబుగా భావించి ఆర్డిఓ కి సగౌరవంగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు అయిన ఓటర్ల సౌకర్యార్థం తమ మోడరన్ ఫౌండేషన్ తరపున ఇరవై వీల్‌చైర్స్ అందజేస్తామని రావు ప్రకటించారు. అనంతరం ఆర్డీవో సుధాసాగర్ మాట్లాడుతూ మోడరన్ ఫౌండేషన్ ద్వారా రావు చేసున్న సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకం అని, ప్రత్యేక అవసరాలు గల ఓటర్ల సౌకర్యార్థం జి.వి.రావు వీల్ చైర్స్ అందజేయడం అభినందనీయం అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మోడరన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్, ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.ప్రకాష్, ఇంటర్మీడియట్ అకడమిక్ అడ్వైజర్ సి.హెచ్.శ్రీనివాస్, మోడరన్ స్టాఫ్ ఎన్.ఎస్.ప్రభాకర్, కె.కృష్ణవేణి, మోడరన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## డిమాండ్లు పరిష్కరించాలంటూ తహశీల్దార్‌కు వినతిపత్రం



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలంటూ గురువారం రావులపాలెం తహశీల్దార్ బండి మృత్యుంజయరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 11వ పి.ఆర్.సి లో 01.01.2022 నుండి తగ్గించిన అడిషనల్ క్యాంటీమ్ ను యధావిధిగా అంతకుముందు 70 సం.లు నిండిన వారికి 10 శాతం 75 సం.లు నిండిన వారికి 15 శాతం పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న డి.ఆర్. బకాయిలను వెంటనే విడుదల చేయాలని. 11వ సి.ఆర్.సి. ఎరియర్స్ వెంటనే చెల్లించాలి, 44 హెల్త్ కార్డుద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన హాస్పిటల్స్‌లో వైద్యము అందించాలి, మెడికల్ రీఇంబర్సుమెంటు పరిధి రూ.2 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎ.యల్.నారాయణ, పి.కృష్ణమోహన్, కె.వీరభద్రం, డి.పనసయ్య, వై.శేషగిరిరావు, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్టీయుకెలో 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్

**– నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న ఎంపి గీతా విశ్వనాథ్**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌ఆయుకె స్టేడియంలో ఖేలో ఇండియా పథకంలో భాగంగా మంజూరైన 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణానికి ఈ నెల 28వ తేదీ ఆదివారం ఉదయం 9.30గంటలకు పార్లమెంట్ సభ్యురాలు వంగా గీతా విశ్వనాధ్ గారు శంఖుస్థాపన చేయనున్నట్లు ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ. జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ జెఎన్టియుకె యూనివర్శిటీకి ఖేలో ఇండియా పథకంలో భాగంగా మంజూరైన 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణానికి మొత్తం రూ.13.55 కోట్ల నిధులు అవసరం కాగా కేంద్ర ప్రభుత్వం రూ.9.50కోట్లు మంజూరు చేయగా దానికి మ్యాచింగ్ గ్రాంట్‌గా యూనివర్శిటీ నుండి రూ.4.05కోట్లు నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ శంఖుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లా అధికారులు, యూనివర్శిటీ అధికారులు, నగర ప్రముఖులు, క్రీడాకారులు హాజరవుతారన్నారు.

# గ్రామ దేవత - వైసీపీ దేవత - నల్లమిల్లి

**అనపర్తి, మేజర్‌న్యూస్ :** ఇటీవల సంక్రాంతి సందర్భంగా అనపర్తిలో గ్రామదేవతగా కొలువైన శ్రీవీరుళ్ళమ్మఅమ్మవారిజాతర మహోత్సవాలు అత్యంత వైభోవేపేతంగా జరిగాయి. ఆ జాతర మహోత్సవాలకు వైసిపి నాయకులకు మాత్రమే ఆహ్వానం రావడంతో వీరులమ్మ తల్లి గ్రామ దేవత లేక వైసిపి దేవత అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూజాతరలో ప్రజలను ఘనంగానే దోచేసారని, దానిపైన ప్రజలయొక్క ఆకాంక్షలను, అనుమానాలను, సందేహాలను నివృత్తి చేయవలసిందిగా వీరుళ్ళమ్మ ఉత్సవ కమిటీని వాటిని మేము ప్రశ్నిస్తే కొంతమంది వక్రభాష్యం తీయడం జరుగుతుందని అన్నారు.

వచ్చిన ఆదాయం, ఖర్చు విషయం పొడిపొడిగా మాత్రమే చెప్పారనిఅకౌంట్స్‌చూసినవారే చెప్పుకుంటున్నా రని అన్నారు. ఆరోజు జాతర సందర్భంగా ఎన్ని స్టాల్స్ ఏర్పాటు చేసారు? ఒక్కొక్క స్టాల్ దగ్గర మీరు రెండు వేల చొప్పున వసూలు చేసారు. ఆ స్టాల్స్ ద్వారా ఎంత ఆదాయం వచ్చింది? అదేవిధంగా జెయింట్ వీల్ వగైరాలు ఎంతకిచ్చారు? అక్కడ 150 రూపాయిలు వసూలు చేయమనే అధికారం మీకెవరు ఇచ్చారు? దీనికి ప్రభుత్వానికి చెల్లించిన



ఎంటర్టైన్మెంట్ టాక్స్ ఎంత ప్రభుత్వం ఇచ్చిన అనుమతు లేమైనాఉన్నాయా..?గ్రామపంచాయితీ గానీ అగ్నిమాపకశాఖ గానీ అనుమతులు ఇచ్చిందా? అనుమతులు పొంది ఉంటే అవి చూపించండి. ఈవిధంగా జరిగిన జాతర వ్యవహారాలలో ఆదాయం ఎంత వచ్చింది? విరాళాలెన్ని వచ్చాయి? గత 30 సంవత్సరాల నుండీ ఉన్న మూలధనం ఎంత? దానికి ఎంత వడ్డీ వస్తుంది? ఇవన్నీ స్పష్టంగా చెప్పండని, మేమేమీ మిమ్మల్ని విమర్శించడం లేదు. ప్రజలలో ఉన్న సందేహాలను మాత్రమే మేం లేవనెత్తుతున్నాం. ప్రజలలో నెలకొన్న సందేహాలను తీర్చవలసిన భాధ్యత అధికార పార్టీ పైనా మరియు కార్యక్రమ నిర్వాహకుల పైనా ఉందని అన్నారు. వాస్తవాలు బయటకు చెప్పకుండా ఎందుకోసం కమిటీ ఒక పార్టీ కొమ్ము కాస్తూ ఉందని అన్నారు. అమ్మవారిని ఏకపక్షంగా చేస్తా ఉన్నారా? అమ్మవారు గ్రామం అంతటికీ సంబంధించిన దేవత కాదా అని అడుగుతున్నా అన్నారు. అమ్మవారితో వ్యవహారం. దీంట్లో తప్పుడు మాటలు, తప్పుడు ప్రచారం చేయకండి. అమ్మవారికి అపచారం చేయకండి. దమ్ము ధైర్యం ఉంటే వాస్తవాలతో బహిరంగ చర్చకు రండి.

తప్పుడు ప్రచారాలు చేయవద్దని వీరుళ్ళమ్మ కమిటీ గౌరవాధ్యక్షులకి గౌరవంగానే చెపుతున్న అని అన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు దత్తుడు శ్రీను, తూర్పుగోదావరి జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు తమలంపూడి సుధాకర్ రెడ్డి,తూర్పుగోదావరి జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు సిరసపల్లి నాగేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా అధికార ప్రతినిధి వెంకటరామారెడ్డి, తూర్పుగోదావరి జిల్లా తెలుగు రైతు కార్యదర్శులు సుబ్బారెడ్డి,తాతారెడ్డి,మాజీ వైస్ ఎంపిపీ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీను, రాష్ట్ర ఎస్సి సెల్ కార్యదర్శి సూర్యప్రకాష్, తదితరులు పాల్గోన్నారు.

## పెరవలిలో ఘనంగా జాతీయ ఓటర్స్ దినోత్సవం

**– ఓటర్స్‌ను సన్మానించిన తాసిల్దార్ టీ.రాజరాజేశ్వరి**



**పెరవలి, మేజర్ న్యూస్ :** భారత రాజ్యాంగాన్ని అనుసరించి ప్రతీఒక్కరూ విధిగా తమ ఓటు హాక్కును వినియోగించుకోవాలని పెరవలి తహాశీల్దార్ టి రాజరాజేశ్వరి అన్నారు. జనవరి 25వ తేదీ గురువారం పెరవలి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మార్వో టి రాజరాజేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారుఅనంతరం విద్యార్ధులచే అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంఆర్ఓ టి రాజరాజేశ్వరి మాట్లాడుతూప్రతీఒక్కరూ(ఓటరు)బాధ్యతగా ఓటు హాక్కు వినియోగించుకోవాలని సూచించారు. 18 ఏళ్ళు నిండిన వారు తమ ఓటు హాక్కువినియోగించుకోవాలని కోరారు. దేశనాయకుడిని సరైన వ్యక్తినిఎన్నుకుంటే భారతదేశం ఎంతో అభివృద్ధిచెందుతుందని వారు ఆశాభావం వ్యక్తంచేశారు. విద్యార్ధినీ విద్యార్ధులందరు మీ తల్లిదండ్రులను ఓటు వేయించేలా అవగాహన కల్పించాలని కోరారు.విద్యార్ధులచే స్లోగన్స్ "మరియు" ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ ఈ విధంగా అందరిచే చేయించారు దేశ పౌరుడు అయిన నేను ప్రజా స్వామ్యం పై విశ్వాసం తో, మన దేశ ప్రజా స్వామ్య సంప్రదాయాలు, స్వేచ్ఛాయుత, నిస్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడుతననీ మతం, జాతి, కులం, వర్గం, భాష, లేదాఏటువంటి ఒత్తిడిలు కి లోనూకాకుండా ప్రతి ఎన్నికలో ఓటు వేస్తానుఅని ఇందు మూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాను అని విద్యార్ధులు అధికారులు ఉపాధ్యాయులు చేత ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో పెరవలి సర్పంచ్ గంగోలు సీతమ్మ జోసెఫ్ డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ ఆర్ఐ పులిదిండి పావని వీఆర్వో సొంగరాజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు సీనియర్ ఓటర్లు పాల్గొన్నారు.

## గోవిందగిరి క్షేత్రంలో స్వామివారి నేత్ర దర్శనం

**– శ్రీవారి ఆలయంలో హుండీ లెక్కింపు**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం మండలం ఐ.పోలవరం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) వారు నిర్మించి నిర్వహిస్తున్న గోవిందగిరి క్షేత్రంలో శ్రీవారి ఆలయంలో గురువారం ప్రత్యేక సేవలో భాగంగా భక్తులకు స్వామివారి నేత్రదర్శనం జరిగింది. కాగా ఆలయంలో (పరకామణి) సేవ హుండీ లెక్కింపు శ్రీవారి సేవకులతో టీటీడి విజిలెన్స్ జమీదార్ శ్రీనివాస్ పర్యవేక్షణలో డిప్యూటి ఈఓ వెంకటయ్య, సూపరింటెండెంట్ మల్లిఖార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సేవలో సేవకులతోపాటు ఆలయ అధికారులు నారాయణరాజు, శివరామ్, పవన్ కుమార్, ఎం.సి.డబ్ల్యు. శ్రీనివాస్, వెంకటరమణ, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా గత మూడున్నర నెలల కాలంలో హుండీ ఆదాయం రూ.5లక్షల 40వేలు వచ్చినట్లు ఆలయ సూపరింటెండెంట్ ప్రకటించారని ధర్మప్రచార సేవా భక్త మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వేంకటరామారెడ్డి తెలియచేసారు.

# ఫిబ్రవరి 16 గ్రామీణ బంద్ జయప్రదం చేయండి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రైతులకు బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, స్వామినాథన్ సిఫారసు మేరకు రైతుల పంటలకు పెట్టుబడికి 50% కలిపి మద్దతు ధర చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోట్లు రద్దుచేసి కార్మికులందరికీ కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట నష్టం, బీమా సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సవరణ బిల్లును రద్దుచేసి, స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని, పోలవరం నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేసి, రైతుల రుణాలను మాఫీ చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి, కనీస వేతనం రోజుకు 600 చెల్లించాలని కోరుతూ ఫిబ్రవరి 16వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్ ని జయప్రదం చేయాలని కార్మిక సంఘాలకు, రైతు సంఘాలకు, ప్రజాసంఘాలకు, రాజకీయ పార్టీలకు సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా కచేరిపేట నందు సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషాబాబ్జి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ మోడీ పాలనలో అంబానీ, అదానీలు దేశ సంపదను దోచుకుంటూ ప్రపంచ కుబేరులుగా ఎదుగుతుంటే, పేద రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటితరంగ కార్మికులు అప్పులపాలై బలవన్మరణాలకు పాల్పడుతూ 10 ఏళ్లలో 1లక్షా 50వేల మంది రైతాంగం వ్యవసాయం గిట్టుబాటుకాక ఆత్మహత్యలకు చేసుకున్నారని, రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ఆత్మహత్యలు 26% పెరిగేయని, ఇందుకు మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలే కారణమని విమర్శించారు. ఈ విధానాలను ప్రశ్నించేవారిపై మోడీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ, నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతూ ప్రజాస్వామిక హక్కులను, రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విధానాలను నిరసిస్తూ జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే రోజున కాకినాడ భానుగుడి నుండి జరిగే మోటార్ సైకిల్ ర్యాలీలో రైతాంగ శ్రేయస్సు కోరే ప్రజాస్వామిక వాదులందరూ పాల్గొని జయప్రదం చేయాలని, ఫిబ్రవరి 16వ తేదీన జరిగే గ్రామీణ బంద్ ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సన్నాహక సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు, తెలుగుదేశం అనుబంధ రైతు సంఘం నాయకులు జొన్నాడ వెంకటరమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్ల ఈశ్వరి, ఏఐఎఫ్టియు జిల్లా నాయకులు కె.అంజిబాబు, కె.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు కృషి చేయాలి

**– కొవ్వూరు సబ్ కలెక్టర్ శ్రీ వాస్తవ**



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు,యువకులు కృషి చేయాలని కొవ్వూరు సబ్ కలెక్టర్ శ్రీ వాస్తవ కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని కొవ్వూరులో గురువారం నిర్వహించిన ర్యాలీలో సబ్ కలెక్టర్ ఇతర అధికారులు, అంగనవాడి, రెవెన్యూ, పోలీస్, విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ కొవ్వూరు విజయ్ విహార్ సెంటర్ నుండి మెయిన్ రోడ్డు మీద స్థానిక ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, స్వచ్ఛంద సంస్థలకు చెందినవారు ప్రతి ఇంటికి వెళ్లి ఓటు ప్రాధాన్యతను వివరించాలన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో నూరు శాతం ఓటింగ్ జరిగేలా కృషి చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో కారణం వద్ద మానవ హారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బి. నాగరాజు నాయక్, సిడిపిఓ మమ్మీ, మున్సిపల్ కమిషనర్ బి, శ్రీకాంత్, పట్టణ సీఐ జగదీశ్వర్ రావు, ఎం ఈ ఓ పి. రామకిషోర్, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** పి.గన్నవరంలో గురువారం ఓటర్ల దినోత్సవం మండల తహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు, కళాశాలల విద్యార్థులు గ్రేస్ విద్యాసంస్థల ప్రాంగణం నుండి పోలీస్ స్టేషన్ వరకు ఓటర్ల అవగాహన ర్యాలీ వచ్చి రోడ్ పై మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హరికోటి శాస్త్రి, మండల విద్యాశాఖ అధికారి కోన హెలినా, గ్రేస్ కాలేజ్ సెక్రెటరీ కరస్పాండెంట్ నల్లి శ్రీ చరణ్, ప్రిన్సిపాల్ పివిఆర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# పౌరసరఫరాల శాఖ రాష్ట్రస్థాయి సమావేశం



కాకినాడ, మేజర్ న్యూస్ : పౌరసరఫరాల శాఖ రాష్ట్ర స్థాయి సమావేశం గురువారం విజయవాడ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సంస్థ చైర్మన్‌గా కాకినాడ సిటీకు చెందిన ద్వారంపూడి భాస్కరరెడ్డి, డైరెక్టర్‌గా కాకినాడ రూరల్‌కు చెందిన వైసిపి మహిళా విభాగం రీజినల్ కోఆర్డినేటర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జమ్మలమడక నాగమణి వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్, డైరెక్టర్ కాకినాడ జిల్లాకు చెందినవారు కావడంతో సమావేశానికి ప్రాధాన్యత పెరిగింది. సంస్థ ఎండి వీరపాండ్యన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగమణి మాట్లాడారు. పౌరసరఫరాలశాఖ అధికారులు తరచూ దాడులు జరిపి 6ఏ కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. అయితే ఈ కేసులు త్వరితగతిన పరిష్కారం కావడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని కేసులు పెట్టారు, కాకినాడ జిల్లాలో ఎన్ని కేసులు ఉన్నాయి, ఎవరిపై ఈ కేసులు పెడుతున్నారు, ఒకే వ్యక్తిపై ఎన్ని కేసులు ఉన్నాయి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు జిల్లా స్థాయిలో పూర్తిస్థాయిలో పనిచేస్తే ఈ కేసుల సంఖ్య తగ్గుతుంది అన్నారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధంగా అధికారుల వ్యవస్థ పనిచేసి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి మరింత ఆదరణ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పౌరసరఫరాల శాఖకు మండల స్థాయిలో ఎంఎస్ఓ లు ఉన్నారు, అదేవిధంగా తహసిల్దార్లు, ఆర్డీవోలు కూడా పర్యవేక్షణ చేసేలా ఆదేశాలు ఇవ్వాలి అన్నారు. ఉచిత బియ్యం నేరుగా లబ్ధిదారులకు మాత్రమే చేరాలి. మొబైల్ వాహనాలు లబ్ధిదారుల ఇంటి ముంగిటికి వెళ్లాలి. ఈ బియ్యాన్ని బయటివారు ఎవరూ కొనకుండా చూడాలి. ఇలాంటి చర్యలు తీసుకోవడం వల్ల 6ఏ కేసులు తగ్గుతాయి అన్నారు. మొబైల్ రేషన్ వాహనాలకు జియో ట్యాగింగ్ చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని ఆమె అభినందించారు. అదేవిధంగా వైయస్సార్ రైతు భరోసా బజార్లు, మరిన్ని రైతు బజార్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు మేలు జరగడమే గాక ప్రభుత్వానికి ప్రజల నుంచి ఆదరణ వస్తుందని నాగమణి సూచించారు. ఈ విషయాలు పరిగణలో తీసుకుని చర్యలు చేపడతామని ఎండి హామీ ఇచ్చినట్లు నాగమణి తెలిపారు.

## హైకోర్టు ఉత్తర్వులతో మాచవరం చెత్త డంపింగ్ సమస్య పరిష్కారం



అంబాజీపేట, మేజర్ న్యూస్ : గత కొంతకాలంగా మాచవరం గ్రామపంచాయతీలో చెత్త డంపింగ్ సమస్య నెలకొనడంతో చెత్త తరలింపు నిలిచిపోయింది. దీంతో ప్రధాన రహదారుల పక్కన చెత్త డంపింగ్ ప్రాంతాలుగా మారిపోవడంతో ప్రయాణికులకు పాదచారులకు చెత్త దుర్వాసనగా మారి ఇబ్బందులు పడుతున్నారు. మాచవరం గ్రామపంచాయతీ పరిధిలోని హడ్కో కాలనీ శివారుణ కౌశిక వద్ద, మాచవరం శివాలయం వద్ద చెత్త డంపింగ్ చేసేవారు. హడ్కో కాలనీలో నివాసం ఉంటున్నవారు చెత్తను ఈ ప్రాంతంలో డంపింగ్ చేయవద్దని మేము దుర్వాసనతో నివాసము ఉండలేక పోతున్నామని అడ్డుకున్నారు. అలాగే మాచవరం శివాలయం వద్ద అక్కడ స్థానికులు అడ్డుకున్నారు. చెత్త సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితాలు రాకపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పంచాయతీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తక్షణం చెత్త సమస్యను పరిష్కరించాలని, చెత్త డంపింగ్‌ను అడ్డుకోరాదని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి పోలీసులకు హైకోర్టు ఉత్తర్వులను అందచేసారు. పోలీసులు, పంచాయతీ సిబ్బంది చెత్తను డంపింగ్ ప్రాంతాలైన హడ్కో కాలనీ, మాచవరం శివాలయం ప్రాంతాలలో చెత్తను డంపింగ్ చేశారు. దీంతో గ్రామంలో చెత్త డంపింగ్ సమస్య పరిష్కారంతో పేరుకుపోయిన చెత్త అంతా తరలించారు. హైకోర్టు ఉత్తర్వులతో చెత్త సమస్యను పరిష్కరించిన పంచాయతీ అధికారులు, పాలకవర్గాన్ని ప్రజలు కొనియాడారు.

## ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి కృషి



సామర్లకోట, మేజర్ న్యూస్ : నవరత్నాలు పథకంలో భాగంగా ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని పెద్దాపురం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ దవులూరి దొరబాబు పేర్కొన్నారు..సామర్లకోట మండలం బ్రహ్మానందపురం గ్రామంలో గురువారం పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల లే అవుట్ లో నవర గ్రామానికి చెందిన లబ్ధిదారులతో దొరబాబు సమావేసమయ్యారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల మనసులో సుస్థిర స్థానం దక్కించుకున్నారని అన్నారు..ఈ సందర్భంగా ఇళ్ల లబ్ధిదారులకు వాళ్ళ స్థలాలను అధికారులు దగ్గర ఉండి చూపించారు..కార్యక్రమంలో ఎంపీపీ.బొబ్బరాడ సత్తిబాబు.. సర్పంచ్ దమ్మల లక్ష్మణరావు.. తాటికొండ అచ్చిరాజు.. డిప్యూటీ తాశీల్దార్ శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోపాలపురం నియోజవర్గ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన హెూం మంత్రి తానేటి వనిత



**దేవరపల్లి, మేజర్ న్యూస్ :** హెూం మంత్రి తానేటి వనిత కార్యాలయంలో సర్వమత ప్రార్ధనలు అనంతరం ఆమె కార్యాలయంను ప్రారంభించారు. కార్యాలయంలో వున్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గానికి ఇంచార్జిగా రావడం చాలా సంతోషంగా ఉందని ఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని నియోజవర్గంలోని ప్రజలకు నాయకులకు ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి వెళ్లి నాయకుల తో సమన్వయం చేసుకుని ముందుకు వెళతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ స్మార్ట్ సిటీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వర రావు(జీవి), జెడ్పీ చైర్మన్ కరువు శ్రీనివాస్ గోపాలపురం జి జనార్దన్ రావు, జడ్పిటిసి పి స్వర్ణలత, మండల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్, ఆయిల్ ఫామ్ డైరెక్టర్. నరహరిశెట్టి రాజేంద్ర బాబు. నల్లజర్ల సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్ బాబు గోపాలపురం వైసిపి నాయకులు వెలగా శ్రీరామ్మూర్తి, ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్ ఆచంట అనసూయ, నియోజవర్గ వైసిపి మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు అభిమానులు కొవ్వూరు మరియు గోపాలపురం నియోజకవర్గంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్రాంతి ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోరుతూ వినతి పత్రం



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** విశ్రాంత ఉద్యోగుల సమస్య పరిష్కారానికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కు అందజేశారు. గురువారం ఉదయం విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎండి ఇబ్రహీం ఖాన్ ఆధ్వర్యంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం సభ్యులు ఏలేశ్వరం తాసిల్దార్ కార్యాలయం చేరుకుని తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా కృషి చేయాలని తాసిల్దార్ కే.చిన్నారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంఖాన్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు వివిధ ప్రభుత్వ అనేక సేవలు అందించిన తమకు ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ప్రభుత్వం ఇచ్చే పింఛను, పి ఆర్ సి వంటిపై తమ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పదవి వివరంలో ఉద్యోగులకు వైద్య సహాయం అందించే విధంగాచర్యలు చేపట్టాలన్నారు.అలాగే మెడికల్ రీయంబర్స్మెంట్ పరిధి రెండు లక్షల నుంచి 5 లక్షల పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి సోమరాజు మాస్టారు, సిహెచ్ గాంధీ, మంచి తాతారావు, కొండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
శుక్రవారం
26 జనవరి 2024


## రహదారి భద్రతపై అవగాహన తప్పనిసరి

**– లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం – కేవి.కృష్ణా రావు**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** 35 వ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించు కొని గురువారం డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ రాజానగరం నందు లైసెన్సు పరీక్షల కొరకు వచ్చిన ధరఖాస్తు దారులకు మరియు వాహనముల ఫిట్నెస్ కొరకు వచ్చిన వాహన యజమానులకు మరింతగా రహదారి భద్రతపై అవగాహన కల్పించడం జరిగినదని జిల్లా రవాణా అధికారి కె విక్రృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 35వ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన అవగాహన కార్యక్రమములో సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె.చైతన్య సుమా, హెూమ్ గార్డ్స్ మరియు వాహన యజమానులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి




**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** రాజమండ్రి రూరల్ నియోజక వర్గ పరిధిలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఈ ఆర్ ఓ ఎస్. సరళా వందనం స్థానిక జెడ్పీ హై స్కూల్ లో సీనియర్ ఓటర్ సిటిజన్స్ ను సత్కరించారు. గురువారం స్థానిక జెడ్పీ హై స్కూల్ జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరళా వందనం మాట్లాడుతూ, ఓటు హక్కు పొందేందుకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఓటరుగా నమోదు కావాలన్నారు. నామినేషన్ ప్రక్రియ జరిగే వరకు ఓటరుగా నమోదు కి అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఓటరు తప్పని సరిగా వారి ఓటు హక్కు వినియోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణ లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి. చిన్నారావు, డిప్యూటీ తహశీల్దార్ సుధిర్ లు తదితరులు పాల్గొన్నారు.

# కృషి విజ్ఞాన కేంద్రం, కలవచర్ల షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక కిసాన్ మేళా

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గురువారం స్థానిక కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా 'కిసాన్ మేళా' ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ రాజమండ్రి డైరెక్టర్ డా. మాగంటి శేషమాధవ్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమానికి రాజానగరం, కలవచర్ల, నరేంద్రపురం, పితాపురం, గోకవరం, గుమ్మల దొడ్డ, గాదరాడ తదితర గ్రామాల నుండి సుమారు 270 మంది షెడ్యూల్ కులాల రైతులు, రైతు మహిళలు, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు, రాజానగరంలో గల విద్యార్థినులు, గుమ్మల దొడ్డ పంచాయతీ సెక్రెటరీ పి.వి. రమణకుమారి, రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘాల సభ్యులు (పందూరు) మరియు కృషి విజ్ఞాన కేంద్రం స్టాఫ్ పాల్గొన్నారు. కిసాన్ మేళ సందర్భంగా కెవికెలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ ను డా. మాగంటి శేషు మాధవ్, డైరెక్టర్ ప్రారంభించారు. ఈ స్టాల్స్ లో కె వి కె శిక్షణ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొంది, కొబ్బరి పీచుతో తాడు, డోర్ మాట్స్, అలాగే జనపనారతో బ్యాగులు, అలంకరణ వస్తువుల తయారీలో మాస్టర్ ట్రైనర్లుగా ఎదిగి, వారు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయంతో అనుసంధానంగా పండించిన వివిధ రకాల దేశవాళీ వరి రకాలు, పంటల సస్యరక్షణ కషాయాలు, ముఖ్యంగా కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ప్రోట్రేల్లలో కూరగాయల నారు, పసుపులో అధిక కుర్కుమిన్ శాతం ఉన్న రకాలు, మామిడి అల్లం, అజోల్ల, జీడి మామిడి అంట్లు, పౌల్ట్రీలో కావేరి, అసిల్ కోళ్ల రకాలు, బ్లాక్ బెంగాల్ మేకలు, చేమ, అరటి రకాలు, న్యూట్రి గార్డెన్ ద్వారా రసాయనాలు పిచికారి చేయకుండా పండించిన కూరగాయల రకాలు, కిచెన్ వ్యర్థాలను




కంపోస్ట్‌గా మార్చి ద్రవరూపంతో కంపోస్టులు తయారుచేసే యూనిట్లను ఎగ్జిబిషన్ స్టాల్స్‌లో ప్రదర్శించారు. కెవికెలు సంయుక్తంగా ఎన్నో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. డా. మాగంటి శేషు మాధవ్, డైరెక్టర్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ కేవీకే వారు మహిళా సాధికారత దిశగా ఎన్నో వినూత్నమైన వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను చేపడుతూ ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల మహిళలకు కొబ్బరి పీచు, జనపనారతో వివిధ రకాల ఉత్పత్తుల తయారీలో నైపుణ్య శిక్షణను కల్పిస్తున్నారని, తద్వారా ఔత్సాహిక ఎంటర్ప్రెన్యూర్షిప్ గా ఎదగడానికి అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కోర్సు చేస్తున్న విద్యార్థులను వివిధ వ్యవసాయ పనిముట్లను ఆధునికరించడంలో మరియు అధునాతన కృత్రిమ మేధాశక్తితో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు రావడానికి కృషి చేయాలని సూచించారు. ట్రాక్టర్ ద్వారా నడపబడే అనేక వ్యవసాయ పనిముట్లను ప్రదర్శించి, వాటి ఉపయోగాలను రైతులకు, విద్యార్థులకు, సందర్శకులకు వివరించారు. డా. వి.యస్.జి.ఆర్. నాయుడు, హెడ్, కెవికె స్వాగతోపన్యాసం చేస్తూ కెవికె షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో లబ్ధిదారులను ఎంపిక చేసి వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా పనిముట్లను వివిధ మండలాలలోని ఎస్సీ రైతులకు, మహిళలకు అందచేస్తున్నామని తెలిపారు.

డా. ఎస్. మాధవరావు డి.ఏ.ఓ. మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ రైతులు, రైతు మహిళలు ఉద్దేశించి ఎస్సీ ఉప ప్రణాళిక నిధుల ద్వారా కెవికె వారు అందజేస్తున్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బి. తాతారావు, డి.పి.ఎం. మాట్లాడుతూ వ్యవసాయాన్ని ఒక వృత్తిగా చేపట్టి వ్యాపారంగా మలుచుకున్నప్పుడే లాభదాయకంగా ఉంటుందని, యువత ముఖ్యంగా సాఫ్ట్వేర్ రంగానికి ఆసక్తి చూపించినప్పటికీ వ్యవసాయాన్ని కూడా చేపట్టాలని సూచించారు.

కిసాన్ మేళా సందర్భంగా ఎస్సీ రైతులకు పలుగుంపార, టార్పాలిను, వరిలో కలుపు తీసే పనిముట్టు, మహిళలు సునాయాసంగా న్యూట్రి గార్డెన్లో కూరగాయల నారు నాటే పనిముట్టు ను అందజేశారు. గుమ్మల దొడ్డకు చెందిన మహిళ గ్రూపులకు కొబ్బరి పీచుతో ఒకేసారి ఎక్కువమంది డోర్ మాట్లు తయారు చేసే ఫ్రేములను అందజేశారు. గోకవరంకు చెందిన రెండు ఎస్.సి. మహిళా గ్రూపులకు రెండు ఉషా కుట్టుమిషన్లను డైరెక్టర్ డా. శేషు మాధవ్ అందజేశారు. ఈ కిసాన్ మేళా కార్యక్రమంలో కెవికె స్టాఫ్ జె.వి.ఆర్. సత్యవాణి, కె. దిలీప్, ఎం.ఏ. రాజు, విజయ వర్ధన్, జె. ప్రబాత్, ఆర్.రత్నాజీ తదితరులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే 25 లక్షల వరకు ఉచిత వైద్యం

**– ఒమ్మి రఘురామ్**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** వైఎస్సార్ ఆరోగ్యశ్రీ క్రింద ప్రభుత్వం రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తోందని, దురదృష్టవశాత్తు కుటుంబంలో ఎవరికైనా జబ్బు చేసినా.. ప్రమాదం సంభవించినా ఈ పథకం కింద ఉచితంగా చికిత్సలు పొందవచ్చునని వై యస్ ఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా జె సి యస్ కో ఆర్డినేటర్, రామచంద్రాపురం పార్టీ పరిశీలకులు ఒమ్మి రఘురామ్ అన్నారు. ఈరోజు జగ్గంపేటలో కొన్ని కుటుంబాలకు ఆయన ఈ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఈ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందని, రాష్ట్ర 1.48 కోట్ల స్మార్ట్ కార్డులను వైద్య శాఖ ముద్రించిందని. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా కార్డుల పంపిణీ చేస్తున్నామన్నారు. కాగా ఇప్పటివరకు 1,04,326 కార్డుల పంపిణీ పూర్తి అయిందన్నారు. 2007 లో ముఖ్యమంత్రి వై యస్ రాజశేఖరరెడ్డి గారు ఆరోగ్యశ్రీ ని ప్రవేశ పెట్టారని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ సేవలను 1,059 రోగాల నుంచి 3,257 రకాల రోగాలను పెంచారన్నారు. ఆరోగ్య ఆసరా కింద చికిత్స అనంతరం అందిస్తున్న భృతి, రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్య సేవలు పొందగలగటం వంటి ప్రయోజనాలన్నీ ప్రజలకు తెలియజేస్తున్నారు. సులువుగా ప్రజలు పథకం సేవలు పొందడం కోసం ప్రభుత్వం ఆరోగ్యశ్రీ యాప్‌ను రూపొందించింది అన్నారు. పేదలకు మేలు చేస్తూ, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారిని మరొకసారి గెలిపించుకొంటే పేదలు బాగుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీలు గొల్లపల్లి శ్రీను, మండల సేవాదళ్ కన్వీనర్ కిలపర్తి వీరబాబు, టౌన్ ప్రెసిడెంట్ కాపవరపు ప్రసాద్, సచివాలయం2 కన్వీనర్ రెడ్డి భాను ప్రతాప్, వైసీపీ నాయకులు నీలపల్లి అప్పారావు, పచ్చిపులుసు వీరబాబు, దత్తి శ్రీనివాస్, కోరాడ సుబ్బారావు, బంట్టు బుజ్జి బాబు, నక్కా వీర బ్రహ్మం , మేడిసెట్టి బాలకృష్ణ, కొల్లు సతీష్, తాడి రాంబాబు, వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు

## సందేశాత్మకంగా సాగిన కొత్త పరిమళం నాటిక



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో ప్రారంభమైన నాటిక పోటీలులో సందేశాత్మకంగా సాగిన కొత్త పరిమళం నాటిక ఇండియా – పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతం, మూడవ ప్రపంచ యుద్ధం భయంతో ప్రజలు క్షణ క్షణం ఒణుకుతూ నరక యాతన పడుతూ బ్రతుకులు ఈడుస్తున్న కాలంగా సాగిన నాటిక ప్రజల మనసులకు ఎంతో హత్తుకుంది. అలాగే కుటుంబ వ్యవస్థను కాపాడండి రెండవ ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరిదెంత నాటిక, ఆనాదిగా కుటుంబ వ్యవస్థను మెరుగుపరుద్దామని చట్టంలో కొన్ని మార్పులు చేస్తున్నారు. ఆ మార్పులు కష్టాలను, కన్నీళ్ళను అనుభవిస్తున్నవాళ్ళకు ఎంతవరకు ఉపశమనం కలిగిస్తుందో అనే కధాంశంగా జరిగిన నాటిక చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ సభ్యులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 29న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** ఈ నెల 29వ తేదిన ఉదయం 11 గంటలకు, మున్సిపల్ కౌన్సిల్ హాలు నందు కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించబడనుందని, కమీషనర్ జె.సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, రెండవ వైస్‌ఛైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మీ సుబ్రహ్మణ్యేశ్వరరావుతో పాటు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొననున్నారని, కమీషనర్ తెలిపారు. కావున పురపాలక సంఘ వివిధ శాఖల విభాగాధిపతులు విధిగా హాజరు కావాలని, కమీషనర్ తెలిపారు.

## గ్రంథాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గ్రంధాలయాధికారిపాలంకి నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, ఓటుహక్కును ప్రతీఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. టి.కామరాజు, కొమ్మన అప్పారావు, సిబ్బంది బుల్లియ్య, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

# చర్చ లేకుండా కోట మిగుల బడ్జెట్ ఆమోదం...

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఎలాంటి చర్చకు అవకాశం లేకుండా రూ. 7,20,85,555 ల మిగులు బడ్జెట్ ను మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించింది. ఎవరికి అర్థంకాని విధంగా మున్సిపల్ బడ్జెట్ కేవలం అంకెల గారడీ గా ఏర్పాటు చేశారని కౌన్సిలర్ లు ఆరోపించారు. సామర్లకోట మున్సిపాలిటీలో కౌన్సిల్ సాధారణ, బడ్జెట్ సమావేశాలు మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణ మూర్తి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో తొలుత వార్డు సమస్యలపై చర్చించేందుకు జీరో అవర్ కేటాయించాలని కౌన్సిలర్ కరణం రాజ్ కుమార్ అధ్యక్షులను కోరారు. అయితే సాధారణ సమావేశం తో పాటు ప్రత్యేక సమావేశమైన బడ్జెట్ ఆమోదాన్ని తెలపాల్సి ఉన్నందున సమయాభావం వలన జీరో అవర్ లేకుండా ఎజెండా అంశాలను ప్రారంభించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ సూచించారు. దానితో జీరో అవర్ కు కౌన్సిల్ చైర్ పర్సన్ సమయాన్ని ఇచ్చేందుకు నిరాకరించారు. కాగా ఏజెంట్ అంశాలను ఏమాత్రం చర్చించకుండానే ఎజెండా మొత్తాన్ని ఆమోదిస్తున్నట్టు వైస్ చైర్మన్ జాన్ మోజెస్ ప్రకటించగా అధికార పక్ష కౌన్సిలర్లు దానికి మద్దతులిచ్చారు. దానితో సాధారణ సమావేశంలోని అంశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. దానిలోని ఒక అంశంగా పొందుపరిచిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, వైఎస్ఆర్సిపి సీనియర్ నేత దవులూరి సుబ్బారావు కో ఆప్షన్ సభ్యుని పదవికి రాజీనామా అంశం కూడా ఉండగా దానిని ఎలాంటి చర్చ లేకుండా కౌన్సిల్ ఆమోదించడం విశేషం.

–మిగుల బడ్జెట్ ఆమోదం .. సామర్లకోట మున్సిపాలిటీలో 2024 – 25 సంవత్సరానికి గాను మిగులు బడ్జెట్ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను మిగులు బడ్జెట్ గా చూపించిన రూ. 9,57,15,566 లతో కలిపి 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 27,06,24,988 ఆదాయం రాగలదని అంచనాలు చూపిస్తూ దానిలో రూ. 29,42,55,000 ఖర్చు కాగలరని అంచనా



వేసి రూ. 7,20,85,555 లు మిగిలి ఉంటుందని అంచనాలతో కూడిన బడ్జెట్ కౌన్సిల్ వద్ద ఉంచగా దానిపై ఎలాంటి చర్చ లేకుండానే అధికారపక్ష కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. అయితే బడ్జెట్ ఎజెండా లోని అంశాలను పూర్తిస్థాయిలో వివరించకుండా దానిని ఆమోదించడం ఎంతవరకు సబబని అధికారపక్ష కౌన్సిలర్లు కరణం రాజ్ కుమార్, పితాని కృష్ణ, నేతల హరిబాబులు ప్రశ్నించారు. ఎలాంటి సబ్ ప్లాన్ నిధులు రాకపోయినా వాటిని ఖర్చు చేసినట్టు ఎజెండాలో పొందుపరిచి, అంకెల గారడీగా బడ్జెట్ ఏజెండాను తయారు చేశారని కౌన్సిలర్ హరిబాబు ఆరోపించారు. ఇంకా ఎజెండా చేతికిచ్చి వాటిపై చర్చ లేకుండా ఆమోదించేందుకు సమావేశం నిర్వహించడం ఎందుకని తమతో సంతకాలు తీసుకొని పంపించవచ్చు కదా అని కౌన్సిలర్ రాజ్ కుమార్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఏది ఏమైనా చెప్పుకోదగ్గ చర్చ లేకుండానే సామర్లకోట మున్సిపల్ బడ్జెట్ ఎజెండాను ఆమోదించడం పట్ల కొందరు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అందరు కౌన్సిలర్లు, మున్సిపల్ అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పల్ల వెంకన్న నర్సరీలో రిపబ్లిక్ డే సందడి




**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ :** బ్రిటిష్ పాలన లో 200 ఏళ్ల తర్వాత బానిస శృంఖలాలను చీల్చుకొని భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సుదినం రిపబ్లిక్ డే. స్వేచ్ఛా వాయువులు నిండిన మేరా భారత్ మహాన్ అంటూ కడియం పల్ల వెంకన్న నర్సరీలో మొక్కలు విచ్చుకున్నాయి. రిపబ్లిక్ డే సందేశాన్ని అందించాయి. 75వ గణతంత్ర వేడుకలకు శుభాకాంక్షలు తెలిపాయి. మువ్వన్నెల రంగులతో సీతాకోకచిలుక ఎగురుతున్నట్లుగా నర్సరీ డైరెక్టర్ పల్ల వెంకటేష్ వినయ్ లు సందేశాత్మకమైన కూర్పును తీర్చిదిద్దారు..గొంగళి నుండి ఎన్నో దశలు మార్చుకొని పంచె వన్నెల సీతాకోక చిలుకలా భారత్ ప్రయాణం అందంగా మార్చబడిందనీ నర్సరీ అధినేత పల్ల సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ఈ కూర్పు నర్సరీ సందర్శకులకు ఇది వేడుకగా కనిపిస్తుంది.

# లక్ష్మీపార్వతికి డాక్టర్ ఆఫ్ లెటర్స్ అవార్డు



**రాజానగరం, మేజర్ న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ లో డా. నందమూరి లక్ష్మీపార్వతి డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డి.లిట్) డిగ్రీ ని పూర్తి చేసి వీసీ ఆచార్య కె.పద్మరాజు చేతుల మీదుగా అవార్డు ను అందుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్ పర్సన్ డా. నందమూరి లక్ష్మీపార్వతికి తెలుగు లో డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డి.లిట్) అవార్డు అందించడం ఆనందంగా ఉందన్నారు. "ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజా నేతల జీవిత చరిత్రలు సమగ్ర పరిశీలన" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసారని అన్నారు. తెలుగులో నిష్ణాతులైన ఆచార్య బృందంచే వైవా నిర్వహించడం జరిగిందన్నారు. విద్య, పరిశోధనలకు వయస్సుతో సంబంధం లేదని నిరూపిస్తూ ఎంతో కష్టపడి డి.లిట్ ను పూర్తి చేసారని ప్రశంసించారు. డి.లిట్ అవార్డు అందుకున్న డా.లక్ష్మీపార్వతికి రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా డా. నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజా నేతల జీవిత చరిత్రలు సమగ్ర పరిశీలన అనే అంశంపై థీసెస్ సమర్పించి డి.లిట్ అవార్డు ను అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. నిత్యవిద్యార్థులుగా ఉంటూ పుస్తకాలు చదవడం ద్వారా ప్రశాంతంగా జీవించవచ్చునని తెలియజేసారు. విద్య, పరిశోధనలపై ఉన్న ఆసక్తితో పీజీ, పిహెచ్.డి లు పూర్తి చేసానని, ఈ వయస్సులో కూడా పరిశోధనలపై ఉన్న ప్రత్యేక శ్రద్ధతో డాక్టర్ ఆఫ్ లెటర్స్ అవార్డును అందుకున్నానని తెలియజేసారు. తాను వ్రాసిన పుస్తకాలకు గౌరవ డాక్టరేట్ వచ్చే అవకాశం ఉన్న కష్టపడి డి.లిట్ పూర్తి చేసానని అన్నారు. విద్యార్థులంతా విద్య, పరిశోధనలలో రాణించాలని సూచించారు. తనను ప్రోత్సహించి అవకాశం కల్పించిన సీఎం జగన్మోహనరెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సెక్రటరీ జె.శ్యామలరావు, యాప్షీ చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ డీన్ డా.కె.రమణేశ్వరి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటే వజ్రాయుధం – ఆర్డీఓ

**– సీనియర్ ఓటర్లకు సన్మానం**




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని (సీక్రెట్ వెపన్) ప్రతీ ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. గురువారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం తహశీల్దార్ వజ్రపు జితేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీఓ జె.సీతారామారావు పాల్గొని మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం పిలుపు మేరకు యువతరం ఓట్లు ప్రగతికి మెట్లు అనే పిలుపుతో 17 సం.లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకొన వచ్చునని, వారికి 18 సం.లు నిండిన వెంటనే క్వాలిఫైయింగ్ డేట్ నందు ఓటరుగా ఎలక్ట్రోరల్ రోల్‌లో చేర్చబడతారని ఆయన తెలిపారు. అలాగే ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో అమూల్యమైనదని, దానిని ప్రతీ ఒక్కరూ దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 80 సం.లు నిండిన సీనియర్ ఓటర్లను ఆర్డీఓ చేతుల మీదుగా సన్మానించారు. అలాగే నూతనంగా ఓటు పొందిన (18 సం.లు నిండిన) యువ ఓటర్లకు ఓటర్ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట కమీషనర్, ఆర్డీఓ కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మీ, డిటి భానుకుమార్, దయానందరాజు, డిటి కాంతారావు, ప్రసాద్, సిసి ఆనంద్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, బిఎల్ఓలు, ఓటర్లు, తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందుగా ఓటర్లతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

# ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

**– పితాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి**

**పితాపురం, మేజర్ న్యూస్ :** ప్రజా స్వామ్యంలో ఓటే వజ్రాయుధమని పితాపురం సీనియర్ సివిల్ జడ్జి కె. మాధవి అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్ మైదానంలో... ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జ్ కె. మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని, ప్రజాస్వామ్య పరిరక్షణకు తప్పనిసరిగా అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. తదనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవానికి సంబంధించి నిర్వహించిన వ్యాసరచన పోటీలు, ఓటర్ల నమోదు కార్యక్రమంలో ప్రతిభ చూపిన సూపర్వైజర్లులకు, బూత్ స్థాయి అధికారులకు ప్రశంసా పత్రాలు అందించడంతో పాటు సీనియర్ ఓటర్లను, దివ్యాంగులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో



పితాపురం తహసీల్దార్ పి. త్రినాథరావు, యు. కొత్తపల్లి తహసీల్దార్, జి. వి. యస్ ప్రసాద్, పితాపురం మునిసిపల్ కమీషనర్ యల్. పి. యస్. యస్. కృష్ణ వేణి, గొల్లప్రోలు కమీషనర్ యం. సత్యనారాయణ, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ డి. కృష్ణ, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్ ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది మరియు సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**కొత్తపేట, మేజర్ న్యూస్ :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తహశీల్దార్ జి.డి కిషోర్ బాబు అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కొత్తపేట అసెంబ్లీ నియోజవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి ఎమ్.ముక్కంటి హాజరయ్యారు. జూనియర్ కళాశాల మరియు ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్ధినీ విద్యార్థులచే ఐ ఓట్ ఫర్ సుర్, నొథింగ్ లైక్ ఓటింగ్ అని ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్, మహిళా ఓటర్లు మరియు వికలాంగ ఓటర్లును ఘనంగా సన్మానించి,విద్యార్ధినీ విద్యార్థులుచే ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. పెద్దిరాజు,కళాశాల సిబ్బంది మరియు జూనియర్ కళాశాల సిబ్బంది,డిప్యూటీ తహశీల్దారు ఎన్. శ్రీనివాసరావు,రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ దినోత్సవ ర్యాలీ..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయం పరిధిలో గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. అలాగే నూతన ఓటర్లకు ఓటర్ కార్డ్స్ జారీ చేశారు. తొలుత పోలింగ్ కేంద్రాల వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించి అత్యధిక ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎలక్షన్ కమిషన్ అధికారి మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీసీ కార్పొరేషన్ అధికారి ఎ. శ్రీనివాసరావు, మండల తాసిల్దార్ మండల తాసిల్దార్ జి,చిన్నారావు, నగర్ పంచాయతీ కమిషనర్ కె శ్రీనివాసరావు వార్డు కౌన్సిలర్లు సుంకర రాంబాబు,దేగల వెంకటరమణ, వైస్ చైర్మన్ త్రివేణి వెంకటేశ్వరరావు, మసిరపు బుజ్జి ఆఫీస్ సిబ్బంది, మెప్మ సిబ్బంది బూతు లెవల్ అధికారులు, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళలకు రూ.80 కోట్ల లబ్ధి

– ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలకు రూ.80 కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, ఎమ్మెల్యే ధనలక్ష్మి అన్నారు. మండలంలోని జడ్డంగి గ్రామంలో గురువారం మధ్యాహ్నం డ్వాక్రా మహిళలకు నాలుగో విడత అసరా చెక్కుల పంపిణీ, సంబరాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ అధ్యక్షతన ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని మండలంలో వైయస్సార్ అసరా ద్వారా ఏడు వేల మందికి ఐదు కోట్ల నాలుగున్నర లక్షలు సున్నా వడ్డీ రెండు కోట్లు, బ్యాంకు లింకేజీ ద్వారా ఐదు కోట్లు,, స్త్రీ నిధి ద్వారా రెండు కోట్ల ఐదున్నర లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి పేదవాడికి విద్య వైద్యం



అందుబాటులోకి తేవడం జరిగింది అన్నారు. ధనిక పేద బేధం లేకుండా విద్యార్థులకు జగనన్న కిట్లు అందజేయడం జరిగిందన్నారు. మండలంలో ఏకలవ్య పాఠశాల, బిటి రోడ్లు, సీసీ రోడ్లు, జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి త్రాగునీటి సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు అన్నారు. పేదల అవసరాలు తెలుసుకొని పరిష్కార దిశగా జగనన్న ప్రభుత్వం అడుగులు వేసింది అన్నారు. టిడిపి హయాంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలు, బంధుమిత్రులుకు లబ్ధి చేకూరేది అన్నారు. అవ్వ తాతలకు పెన్షన్ పొందాలంటే ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. పేదవాడి కళ భూమి, ఇల్లు ఆ కలలను వైసిపి ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను, ఎమ్మెల్యే ధనలక్ష్మిని ఆశీర్వదించాలని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి, సంక్షేమం అందించడం జరుగుతుందని ఎమ్మెల్సీ ఉదయ భాస్కర్ అన్నారు. అనంతరం జగనన్న చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. వైసీపీ మండల కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, దాట్ల వెంకటేశ్వరరాజు, సర్పంచులు చంద్రుడు, వెంకటలక్ష్మి, గని లక్ష్మి, సత్యవతి, ఆదిరాజు, నాయకులు కనిగిరి వీరబాబు, సింగిరెడ్డి రవి, కు సరాజు తదితరులు ఉన్నారు. ఎంపీడీవో ఎం వి రంగారావు. ఏపీఎం ఆదినారాయణ, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు. సిఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్సై రఘునాథరావు నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో జనసేన, టీడీపీ ముందంజ



**దేవరపల్లి, మేజర్ న్యూస్ :** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో జనసేన టిడిపి ముందుంటుందని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు పేర్కొన్నారు. మండలంలో యాదవోలు దేవరపల్లి గ్రామాలలో ఇటీవల మృతి చెందిన నాలుగు కుటుంబాల సభ్యులను పరామర్శించి జనసేన టిడిపి ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆర్థిక సహాయం అందజేశారు. దళిత కుటుంబాలకు రెండు పార్టీల నాయకులు జనసేన సువర్ణ రాజు టిడిపి ముప్పిడి వెంకటేశ్వరరావు కలిసి ఒక్కొక్కరికి 10,000/–రూ చొప్పున సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు కొయ్యలమూడి చినబాబు, అనిశెట్టి ప్రభాకర్ , అనిశెట్టి శ్రీనివాస్, అనిశెట్టి మధు, శివ స్వామి, వెంకీ, సుంకర దుర్గారావు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## రాజవొమ్మంగిలో జాతీయ ఓటర్ల దినోత్సవం



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన రాజవొమ్మంగి లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తాసిల్దార్ వై వి సుబ్రహ్మణ్యం ఆచారి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సెంటర్ నుండి అల్లూరు జంక్షన్ వరకు విద్యార్థులు, గ్రామస్తులు తో భారీగా ర్యాలీ నిర్వహించారు. అల్లూరు జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతి ఒక్కరు ఓటు హక్కును సమర్థవంతంగా వినియోగించుకోవాలని తాసిల్దార్ వై వి సుబ్రహ్మణ్యం ఆచారి అన్నారు. కులమతాల కతీతంగా ఓటును నిర్భయంగా సమర్థవంతమైన నాయకుడు కు ఓటు వేసి ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మనందరి పైన ఉందని తాసిల్దార్ అన్నారు. ఈ మేరకు సీనియర్ సిటిజన్స్, గ్రామస్తులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విఆర్వో సూర్యకాంతం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉన్నారు.

## యర్నగూడెంలోని జూనియర్ కళాశాల విద్యార్ధులకు "గణతంత్ర భారతం"



దేవరపల్లి, మేజర్ న్యూస్ : దేవరపల్లి మండలం, యర్నగూడెంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు సామాజిక విశ్లేషకులు, కాలమిస్ట్ సుంకవల్లి సత్తిరాజు "గణతంత్ర భారతం" అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుంకవల్లి సత్తిరాజు మాట్లాడుతూ, ప్రపంచంలో ఆర్థిక మాంద్యం కొనసాగుతున్నప్పటికీ భారత దేశం తట్టుకుని నిలబడగలగడం విశేషమని పేర్కొంటూ దేశ ప్రజల శ్రమశక్తి, యువశక్తి దీనికి కారణమని, భారత దేశానికి యువత ఒక వరమని, యువతకు చదువుతో పాటు, నైపుణ్యత అత్యంత ఆవశ్యకమని వివరించారు. సింగపూర్,స్విట్జర్లాండ్,లక్సెంబర్గ్ వంటి చిన్న దేశాలు కూడా ప్రపంచంలో ధనిక దేశాలుగా కొనసాగుతున్నాయని, వీటి ఆర్థికశక్తికి గల కారణాలను తెలుసుకుని మన దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని, ఇప్పటికే భారతదేశం ప్రపంచంలో 5 వ బలమైన ఆర్థిక వ్యవస్థ గా ఎదిగిందని, ప్రపంచ జనాభాలో మొదటి స్థానం ఆక్రమించిన భారత్ ఆర్థికంగా కూడా అగ్రదేశాలకు ధీటుగా ఎదగాలని సుంకవల్లి సత్తిరాజు ఆకాంక్షించారు. బ్రిటన్ వంటి దేశాలు ఆర్థికంగా క్షీణించాయని, పాకిస్తాన్ లాంటి దేశాలు ఆకలితో అలమిటిస్తున్నాయని పేర్కొన్నారు. రష్యా– ఉక్రెయిన్ల మధ్య సుమారు 2 సంవత్సరాలుగా సాగుతున్న యుద్ధం వలన ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడిందని, ప్రస్తుత సరళీ కృత ఆర్థిక విధానాల వలన, గ్లోబలైజేషన్ వలన ప్రపంచంలో ఏ చిన్న సమస్య ఏర్పడినా ప్రపంచ దేశాలన్నీ మూల్యం చెల్లించవలసి రావడం బాధాకరమని పేర్కొంటూ యుద్ధాల వలన ఎవరికీ ఒనగూడే ప్రయోజనం ఉండదని వివరించారు. జనవరి 26 వ తేదీన జరిగే 75 వ గణతంత్ర దినోత్సవం దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపాలని ఆశిస్తూ, ఈ సందర్భంగా భారత రాజ్యాంగ మౌలిక స్వరూపం గురించి విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు, యువ విద్యార్థులు పాల్గొన్నారు.

## చదువు బంగారం కంటే విలువైనది

– కొత్తపేట జెడ్పిటిసి గూడపాటి రామాదేవి



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** కోనసీమ జిల్లా పి గన్నవరం మండలం నరేంద్రపురం గురుకుల పాఠశాలలో మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో జాతీయ ఘణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన కొత్తపేట జెడ్పీటీసి సభ్యులు గూడపాటి రామాదేవి చేతులు మీదుగా నరేంద్రపురం గురుకుల పాఠశాల నుండి ఆటల పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలో విజేతలుగా నిలిచిన పది మంది విద్యార్థులకు మమత స్వచ్ఛంద సేవా సమితి వారు సమకూర్చిన విద్యా పరికరాలను ఫేడ్స్ పెన్నులు పెన్సిళ్లు అందించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి రమాదేవి మాట్లాడుతూ చదువు బంగారం కంటే ఎంతో విలువైనది ప్రతి విద్యార్థి చదువు చదువుతో పాటు ఆటలు పాటలు ఎంతో అవసరమని వాటి ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని విద్యార్థుల ఉద్దేశించి ప్రసంగించి రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా మమత స్వచ్ఛంద సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోరుకొండ జాన్ మాట్లాడుతూ నరేంద్రపురం గురుకుల పాఠశాలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని మెయిన్ రోడ్ నుండి పాఠశాల వరకు రోడ్డు నిర్మాణ చేయాలని అధికారులను ప్రజా ప్రతినిధులను ఈ కార్యక్రమంలో గోసింగి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎస్.శాస్త్రి, రవిశంకర్, పిఈ టి దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటుహక్కుపై ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు



కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్టియుకె యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె)లో గురువారం ఉదయం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎం.హెచ్.ఎం. కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని, ఈ విషయంలో ప్రతీ ఒక్కరు తప్పకుండా ఓటు హక్కును నమోదు చేసుకుని ఎన్నికల సమయంలో ఓటును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రొ. ఎం.హెచ్.ఎం. కృష్ణప్రసాద్, అధికారులు విద్యార్థుల చేత ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతిజ్ఞ చేయించగా రెవెన్యూ అధికారులు ఈవిఎం మెషిన్లపై విద్యార్థులకు అవగాహన కల్పించి 100మందికి ఓటరు రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొ.యువి.రత్నకుమారి, ప్రొ.కె.మీరాసాహెబ్, జెఎన్టియుకె ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డా.జి.శ్యామ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్–1,2,3 ప్రోగ్రాం ఆఫీసర్లు కె.రమణాజీ, ఎంవిఎస్వి.కిరణ్మయి, డా.పి.వీరలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పట్టాభిషేకం

– ఉత్తమ అవార్డుకు ఎంపికైన ఏ.ఇ. ఓ, వి.వి.లక్ష్మి నారాయణ



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జరిగే ఉత్తమ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో వరరామచంద్రాపురం, మండల విద్యాశాఖాధికారిగా, విధులు నిర్వహిస్తున్న ఏం.ఇ.ఓ,వి.వి.లక్ష్మీ నారాయణ, మండల ఉత్తమ విద్యా శాఖాధికారిగా ఎంపికయ్యారు.నేడు(శుక్రవారం) కలెక్టర్ సుమిత్ కుమార్,చేతుల మీదుగా అవార్డు అందుకొనున్నారు.

## ఎన్నికల ముందస్తు ఏర్పాట్లుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యస్ జవహర్ రెడ్డి రీ సర్వే, ఉపాధి హామీ, జలజీవన్ మిషన్, పిఎంజి , వైద్య ఆరోగ్య, ఎన్నికల ముందస్తు ఏర్పాట్లు పై కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. మాధవీలత జిల్లా ప్రగతిపై సమగ్ర నివేదికను వివరిస్తూ, జిల్లాలో 3 దశ రీ సర్వే లో 90 గ్రామాల్లో గ్రామ , మండల స్థాయి లో 100 శాతం లక్ష్యాలను సాధించడం జరిగిందన్నారు. రీ సర్వే తదుపరి దశ పనులను వేగవంతం చేయడం జరిగిందన్నారు. వెబ్ లాండ్ లో రికార్డులను 100 శాతం అప్డేషన్ చేసినట్లు తెలిపారు. ఆర్ వో ఆర్ మాడ్యుల్ కి చెంది 126 గ్రామాలకు గాను 100 గ్రామాల్లో పూర్తి చేసినట్లు,26 గ్రామాల్లో సాంకేతిక పరంగా పెండింగ్ లో ఉన్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో కమిషన్ మార్గదర్శకాలు మేరకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మాధవీలత తెలియ చేశారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇప్పటికే ఆయా నియోజక వర్గ రిటర్నింగ్ అధికారులకి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనర్ ల ద్వారా కార్యశాల నిర్వహించినట్లు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష 2 వ విడత లో ఇప్పటి వరకు 66 క్యాంప్స్ నిర్వహించి 27232 మందికి వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఇంటింటి సర్వే ద్వారా 9607 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జే ఏ ఎస్ రెండో విడత లో 167 మందికి తదుపరి వైద్య సేవలు కోసం సిఫార్సు చెసినట్లు తెలిపారు. మిగిలిన వారి ఆరోగ్య వివరాలు కోసం వాలంటీర్, వైద్య సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర వైద్య ఆరోగ్య సహాయ మంత్రి పర్యటన సందర్భంలో రాష్ట్రంలో అమలు జరుగుతున్న ఆరోగ్య సురక్ష పట్ల ప్రశంసలు ఇచ్చినట్లు తెలిపారు. జగనన్న కంటి వెలుగు కింద 1710 మందిని పరీక్షించినట్లు తెలిపారు. జిల్లాలో 130812 హెల్త్ కార్డులకు గానీ 7711 పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో వైయస్ఆర్ ఆరోగ్యశ్రీ యాప్ ను 279209 మంది డౌన్లోడ్ చేసుకోవడం జరిగిందన్నారు. ఉపాధిహామీ పథకంలో 48 లక్షల పనిదినాలకు గాను 44.25 లక్షలు లక్ష్యం సాధించినట్లు తెలిపారు. పూర్తి చేసిన ప్రాధాన్యత భవనాలు ప్రారంభించడం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, జిల్లా ఎక్సైజ్ అధికారి సోమ శేఖర్ సిపివో ఎల్. అప్పల కొండ, డ్వామా పిడి ఏ . ముఖ లింగం, పిఆర్ ఎస్ ఈ ... ఎ బి వి ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ బి. బాల శంకర రావు, వైద్యాధికారులు డా కె. వేంకటేశ్వర రావు, డా ఎన్. సనత్ కుమారి, తదితరులు పాల్గొన్నారు

## భారత రాజ్యాంగం అనుసరించి ప్రతీఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలి

– తహశీల్దార్ ఎన్ శ్రీధర్
– ఏ.ఎస్.డి.ఎస్.చైర్మన్ ఉండవల్లి గాంధీ బాబు




**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్:** భారత రాజ్యాంగాన్ని అనుసరించి ప్రతీఒక్కరూ విధిగా తమ ఓటు హోక్కును వినియోగించుకోవాలని,తహశీల్ధార్ ఎన్. శ్రీధర్, ఏ.ఎస్.డి.ఎస్.చైర్మన్ ఉండవల్లి గాంధీబాబు,అన్నారు.గురువారం వరరామచంద్రాపురం, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమాన్ని,ఎం.ఇ.ఓ,వి.వి. లక్ష్మీనారాయణ,అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీఒక్కరూ(ఓటరు)బాధ్యతగా ఓటు హోక్కు వినియోగించుకోవాలని,సూచించారు. 18 ఏళ్ళు నిండిన వారు తమ ఓటు హోక్కు వినియోగించుకోవాలని కోరారు. దేశనాయకుడిని సరైన వ్యక్తిని ఎన్నుకుంటే భారతదేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థినీ విద్యార్థులందరు మీ తల్లిదండ్రులను ఓటు వేయించేలా అవగాహన కల్పించాలని కోరారు.విద్యార్థులచే స్లోగన్స్ "మరియు" ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం. సి.హెచ్.బాబురావు,ఉపాధ్యాయులు శిరమయ్య, వెంకటలక్ష్మి, అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకి రాజ్యాధికారం జనసేన లక్ష్యం

– జనసేన నిడదవోలు ఇంచార్జ్ భోగవల్లి



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామంలో జనవరి 24వ తేదీ సాయంత్రం బీసీలు ఎస్సీలు సుమారు 60 మంది జనసేన గ్రామ అధ్యక్షులు రేలంగి రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి చిట్టిడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిడదవోలు నియోజకవర్గం జనసేన సమన్వయకర్త భోగవల్లి ప్రసాద్ సమక్షంలో జనసేన లో చేరారు.ఈ సందర్భంగా భోగవల్లి ప్రసాద్ వారికి కండువాలు వేసి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. సంక్రాంతి సంధర్భంగా జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు సమర్ధవంతంగా నిర్వహించినందుకు ముక్కామల జనసైనికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో చేరిన బీసీ, ఎస్సీ లను ఉద్దేశించి మీకు నేను, జనసేన పార్టీ అండగా వుంటాది అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన – టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రజలు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పెరవలి మండల జనసేన పార్టీ అధ్యక్షులు పిప్పర రవి, టీడీపీ – జనసేన సమన్వయ కర్త పాలా వీరాస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు కాకర్ల నాని, వులుసు సౌజన్య, మండల సీనియర్ నాయకులు కోటిపల్లి మురళి, నందిప శ్రీనివాస చక్రవర్తి, పోప్పొప్పు నాగేశ్వరరావు, పోప్పొపు శ్రీను , మెడిచర్ల శివ,,సత్తిబాబు, ముక్కామల నాయకులు గండేపల్లి హనుమంతరావు, ఓదూరి నరసింహస్వామి కొత్తపల్లి సత్తిబాబు,తాడి పవన్, మారిసెట్టి రాజు, దుర్గారావు, అంబటి అశోక్ బండి అయ్యప్ప ,సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బాలికా దినోత్సవం

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** బాలిక దినోత్సవం సందర్భంగా రేవతి సైన్స్ ఫౌండేషన్– రామచంద్రపురం వారి ఆధ్వర్యంలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్ లో సామర్లకోట ప్రతిభ విద్యానికేతన్(ఇం. మీ) పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన ప్రోజెక్టులలో జూనియర్ విభాగంలో6వ తరగతి విద్యార్థిన దేవి మనోజ, సీనియర్స్ విభాగంలో 8వ తరగతి విద్యార్థిని వైష్ణవి లు ప్రథమస్థానాలలోను, 7వ తరగతి విద్యార్థిన. విద్యా జ్యోత్స్న ప్రత్యేక బహుమతిని మరియు అబ్దుల్ కలాం రోల్ ప్లేలో 9వ తరగతి విద్యార్థిన హేమశ్రీ ద్వితీయస్థానంలోను నిలిచి, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన "జనవిజ్ఞాన వేదిక రాష్ట్రగౌరవ అధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, రేవతి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మరియు ఇతర అతిధుల చేతుల మీదుగా బహుమతులను అందుకొని ప్రశంసించబడ్డారు.



ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శనాంశములతో విజేతలుగా నిలిచిన విద్యార్థినులను, వారిని తీర్చిదిద్దిన సైన్స్ ఉపాధ్యాయులు వై. మంగాదేవి, వి.ఎం.ఎస్. శివతేజ, ఎం. మణికంఠేశ్వరి, ఎం. శ్రీమన్నారాయణ," లను పాఠశాల డైరెక్టర్ ఎస్ వి వి ఎస్ .ప్రకాష్, , కార్యదర్శి సుధారాణి ప్రకాష్, ప్రిన్సిపాల్ . సునీత, వైస్ ప్రిన్సిపాల శ్రీగౌరి మరియు ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థుల సమక్షంలో తమ సంతోషాన్ని వ్యక్తంచేస్తూ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ బాలికలుపాఠశాల స్థాయి నుండి శాస్త్రీయ విజ్ఞానాన్ని, ప్రయోగాత్మక నైపుణ్యములను అలవరచుకోవడం ద్వారా మరింత అభివృద్ధి పథంలో పయనించి ఉన్నత స్థానంలో గుర్తింపు పొందుతారని, తద్వారా వారి తల్లిదండ్రులకు, పాఠశాలకు గౌరవాన్ని తెస్తారని సందేశమిచ్చారు.